
మహబూబ్‌నగర్ వార్త
నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల / నారాయణపేట



# వైద్య సేవల్లో.. మరో మైలురాయి..!

- నేడు జడ్చర్లలో వంద పడకల దవాఖాన ప్రారంభోత్సవం
- ముఖ్య అతిథిగా హాజరుకానున్న ఆరోగ్య శాఖ మంత్రి టి.హరీశ్‌రావు
- దవాఖాన ఏర్పాటుపై ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి ప్రత్యేక శ్రద్ధ
- హాస్పిటల్‌లో ఎక్స్‌రే, రక్త పరీక్షల ల్యాబ్
- ప్రత్యేక మాతాశిశు సంరక్షణా కేంద్రం
- ఐసీయూ,బ్లడ్ బ్యాంక్, డయాలసిస్, ఎమర్జెన్సీ సేవలు..





స్వరాష్ట్రంలో వైద్యరంగంలో కనీవినీఎరుగని రీతిలో మార్పులు చోటుచేసుకున్నాయి.. పేదలకు ఖరీదైన, మెరుగైన వైద్యం అందుబాటులోకి వచ్చింది.జడ్చర్లదవాఖాన ఇప్పటికే అప్‌గ్రేడ్‌కాగా నూతనంగా 100పడకల ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రి ప్రారంభానికి సిద్ధమైంది.దీంతో పేదలకు వైద్యపరీక్షలతోపాటు ఎక్స్‌రే,స్కానింగ్, ప్రత్యేక ల్యాబ్, డయాలసిస్,మాతా శిశుసంరక్షణాకేంద్రం,ఎమర్జెన్సీ సేవలు, ఆర్థోపెడిక్‌వార్డు లాంటి వైద్యసదుపాయాలు అందుబాటులోకి రానున్నాయి. స్థానిక ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి కృషితో దవాఖాన మంజూరుకాగా, ప్రత్యేక శ్రద్ధతో నిరంతరంగా పర్యవేక్షిస్తూ పనులు పూర్తి చేయించడంతో నేడు ప్రారంభానికి సిద్ధమైంది. *- మహబూబ్‌నగర్ ప్రతినిధి, మే26, ప్రభాతవార్త*

జడ్చర్ల మండలంతోపాటు చుట్టు పక్కల ప్రజలు అత్యవసర వైద్యంతోపాటు ఏ చిన్న రోగం వచ్చినా మహబూబ్‌నగర్ జిల్లా దవాఖానకు వెళ్లాల్సి వచ్చేది. చాలా సందర్భాల్లో ప్రాథమిక చికిత్స కూడా అందని పరిస్థితి ఉండేది. 2014కు ముందు బాదేపల్లి దవాఖానలో ఎర్ర గోలి, పచ్చ గోలి అన్న తీరుగానే వైద్య సేవలు ఉండేవి. స్వరాష్ట్రంలో జడ్చర్ల ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి హయాంలో వైద్య సేవల్లో చాలా మార్పు వచ్చింది. వైద్య ఆరోగ్య శాఖ మంత్రిగా ఉన్నప్పుడు బాదేపల్లి ప్రాథమిక దవాఖానను అప్‌గ్రేడ్ చేశారు. జడ్చర్ల దినదినాభివృద్ధి చెందుతుండడంతో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా వైద్య సేవలు మెరుగు పడాలని లక్ష్మారెడ్డి రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. కాగా జిల్లా కేంద్రం 15కిలోమీటర్ల దూరం ఉండడంతో అతి సమీపంలో ఉన్న కారణంగా 100 పడకల దవాఖాన మంజూరు చేయడం సాధ్యపడని తరుణంలో అన్ని తానై సీఎం కేసీఆర్‌తో తనకున్న ప్రత్యేక అనుబంధంతో పట్టుబట్టి దవాఖానను మంజూరు చేయించారు.

**అత్యాధునిక వసతులు..** అత్యాధునిక వసతులతో మెరుగైన వైద్య సదుపాయాలతో ప్రజలకు అందుబాటులో ఉండేలా ఆసుపత్రిని జడ్చర్ల మండల కేంద్రానికి అతి సమీపంలో కల్వకుర్తి రోడ్డులో నిర్మించారు. మూడు అంతస్థుల్లో లక్షకు పైగా స్క్వేర్ ఫీట్‌తో, రెండు ఎకారలకు పైగా స్థలంలో నిర్మాణ పనులు చేపట్టారు. 2017 సంవత్సరంలో మొదట రూ.20కోట్లతో పనులు ప్రారంభించగా ఇప్పటికే రూ.25కోట్ల అంచనా వ్యయంతో పనులు పూర్తయ్యాయి. పనులు పూర్తి కావడంతో నేటి నుంచి పూర్తి స్థాయిలో అందుబాటులోకి రానున్నది.

**ఎమర్జెన్సీ, డయాలసిస్ సేవలు..** నేషనల్ హైవే -167 ఇదే జడ్చర్ల మార్గంలో వెళ్తుండడంతో ఎమర్జెన్సీ సర్వీసెస్ తప్పని సరి అవసరం ఉంటాయి. దానికి అనుగుణంగా వంద పడకల దవాఖానలో అన్ని రకాల సౌకర్యాలు వసతులు ఉండేలా చర్యలు తీసుకున్నారు. ప్రత్యేకంగా డయాలసిస్ లాంటి సేవలు అందుబాటులోకి రానుండడంతో పేదలకు ఆర్థికభారం తగ్గనున్నది. రక్తమార్పిడికి జిల్లా జనరల్ దవాఖానకు వెళ్లాల్సి వస్తున్నది. జడ్చర్ల దవాఖాన ప్రారంభంతో ఇక్కడి రోగులు ఇక్కడే సేవలు పొంది డయాలసిస్, ఐసీయూ, పీడీసీయూ యూనిట్లు, ప్రత్యేక మెటర్నిటి సేవల,ల్యాబ్, బ్లడ్ బ్యాంక్ సదుపాయాలు అందుబాటులోకి రానున్నాయి.

**పేదల ఆరోగ్యమే లక్ష్యంగా..** జడ్చర్ల మీదుగా నేషనల్ హైవే ఉండడం,పట్టణ జనాభా రోజురోజుకూ పెరుగుతుండడంతో అత్యవసర సేవలకు 100పడకల దవాఖానలో అన్నిరకాల వైద్యసేవలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకున్నాం.నేటి నుంచి పూర్తిస్థాయిలో వైద్య సేవలు అందుబాటులోకి రానున్నాయి.గతానికి ఇప్పటికీ వైద్యసేవలు,ఇతర అభివృద్ధివిషయంలోనూ ప్రజలు తేడాను గమనించాలి. మాది సంక్షేమం, అభివృద్ధి ప్రభుత్వం. **- డా.సి.లక్ష్మారెడ్డి, జడ్చర్ల శాసన సభ్యుడు**

## వాటరింగ్‌డేగా పాటించి..
# మొక్కలకు నీళ్లు పోయాలి
### - జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్

**వనపర్తి ప్రతినిధి,మే 26 ప్రభాతవార్త:** వేసవి తీవ్రత ఎక్కువగా ఉన్నందున వరుసగా మూడు రోజుల పాటు వాటరింగ్ డే గా పాటించి మొక్కలకు నీళ్లు పోయాలని జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ఒక ప్రకటనలో తెలిపారు. గత హరితహారం ద్వారా నాటిన ప్రతి మొక్కను రక్షించుకోవాల్సిన బాధ్యత ఉందని తెలియజేశారు. ప్రస్తుతం ఎండలు విపరీతంగా ఉండడం వల్ల మొక్కలు చనిపోయే ప్రమాదం ఉందని అందువల్ల వనపర్తి జిల్లాలోని అందరూ పంచాయతీ సెక్రటరీలు, మండల అధికారులు, ప్రతి ప్రభుత్వ సిబ్బంది మూడు రోజుల పాటు వాటరింగ్‌డే లో భాగస్వాములు కావాలని, అందుబాటులో ఉన్న ప్రతి మొక్కకు నీరు పోసి మొక్కలను రక్షించుకోవాలని ఆయన ఆదేశించారు.

# గిరిజన తండాలకు సకల సదుపాయాలు..!

- రూ.3.34 కోట్లతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు ప్రారంభోత్సవాలు
- 300కోట్లతో చేపట్టిన మిషన్ భగీరథ పనులు దాదాపు పూర్తి కావచ్చాయి
- 15 రోజుల్లో వనపర్తి నియోజకవర్గంలో అన్ని గ్రామాలకు పుష్కలంగా తాగునీరు
- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి



చిట్యాల నుండి పడమటి తండా రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి



పనులను పరిశీలించి మాట్లాడుతున్న మంత్రి నిరంజన్‌రెడ్డి



వాల్వ్ ఇప్పి నీటిని విడుదల చేస్తున్న మంత్రి నిరంజన్‌రెడ్డి

**వనపర్తి ప్రతినిధి,మే 26 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గిరిజన తండాలకు స్వయం పాలన కొరకు గ్రామ పంచాయతీలు మార్చడమే కాకుండా సకల సదుపాయాలు కల్పిస్తున్నట్లు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం వనపర్తి మండలంలో పర్యటించి 3.34 కోట్ల రూపాయల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. తూర్పు తాండాలో రూ.20 లక్షల వ్యయంతో నిర్మించనున్న నూతన గ్రామ పంచాయతీ భవనానికి మంత్రి శంకుస్థాపన చేశారు. చిట్యాల నుండి పడమటి తాండ వరకు రూ.43లక్షల వ్యయంతో బి.టి రోడ్డుకు శంకుస్థాపన చేశారు. అనంతరం అచ్యుతాపూర్ నుండి చిట్యాల వరకు రూ.1.70 కోట్ల వ్యయంతో వేయనున్న బీటీ రోడ్డుకు మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా అచ్యుతాపూర్‌లో మైసమ్మ గుడి పెద్దమ్మ గుడిలో మంత్రి దర్శనం చేసుకోగా పూజారి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం ఆర్ అండ్ బి రోడ్ నుండి పాపాగనితాండకు రూపాయలు 54 లక్షల వ్యయంతో ఏర్పాటు చేయనున్న బీటీ రోడ్డుకు శంకుస్థాపన చేశారు. చందాపూర్ పంచాయతీ రాజ్ రోడ్డు నుండి పెద్దతాండ వరకు రూ.47 లక్షల అంచనా వ్యయంతో ఏర్పాటు చేయనున్న బి.టి రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... రాష్ట్ర ప్రభుత్వం గిరిజనులకు తాండాలు, గూడెంలను గ్రామ పంచాయతీలుగా మార్చడం జరిగిందని, తద్వారా తమ ఊరి అభివృద్ధి తామే చేసుకునే విధంగా పరిపాలన సౌలభ్యం కల్పించిందని తెలియజేశారు. తాండాలు, గూడెంలలో అవసరమైన మౌలికసదుపాయాలు విద్యుత్,రోడ్లు, పాఠశాలలు, డ్రైనేజీలు,మిషన్ భగీరథ ద్వారా తాగునీరు తదితర అన్ని సౌకర్యాలు కల్పించడం జరిగిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అన్ని వర్గాల వారికి సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు అందిస్తుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ రాజ్ ఈఈ మల్లయ్య, మండల అభివృద్ధి అధికారి సుదర్శన్, ఆయా గ్రామ పంచాయతీల సర్పంచులు లక్ష్మణ్, ఫుల్సింగ్ నాయక్, శారద, రుప్లి, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు మంత్రి వెంట పాల్గొన్నారు.

**తీరనున్న తాగునీటి సమస్య**

**రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి**

వనపర్తి పట్టణానికి తాగునీటిసమస్య ఈరోజుతో తీరుతుందని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డినిరంజన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మధ్యాహ్నం గుంపు గట్టు వద్ద రామన్‌పాడు నుండి గోపాల్‌పేట వెళ్లే మంచినీటి పైపులైన్ నుండి బైపాస్ ద్వారా వనపర్తి పట్టణానికి 6 యం.ఎల్.డి పైపు లైన్‌కు వాల్వ్ ఇప్పి నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... వనపర్తి పట్టణానికి రామన్‌పాడు వాటర్ పాత పైపులైన్‌ను వాడడం వల్ల పట్టణంలో తాగునీటికి ఇబ్బందులు తలెత్తాయన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వనపర్తి జిల్లాకు రూ.300కోట్ల నిధులతో మిషన్ భగీరథ అడిషనల్ ప్రాజెక్టు మంజూరు చేశారని అది దాదాపు పూర్తి కావచ్చింది అన్నారు. మరో 15 రోజుల్లో ఈ మిషన్ భగీరథ ప్రాజెక్టు పనులు పూర్తి అయి వనపర్తి పట్టణంతో పాటు అన్ని గ్రామాలకు పుష్కలంగా తాగునీరు అందుతుందని తెలియజేశారు. వనపర్తి పట్టణానికి అయితే ఈరోజుతో తాగునీటి సమస్య తీరుతుందని పేర్కొన్నారు. ఆర్డీవో పద్మావతి, మున్సిపల్ కమిషనర్ విక్రమ్‌సింహారెడ్డి, ప్రజాప్రతినిధులు, అధికారులు మంత్రి వెంట పాల్గొన్నారు.

# సీఎం కేసీఆర్ వయస్సెంత.. నీ వయస్సెంత..!

- సంస్కారం లేకుండా ఇష్టారీతిగా మాట్లాడుతావా..
- బలహీన వర్గాలంటే ఎందుకంత చిన్నచూపు..
- 2టీఎంసీల సామర్థ్యం ఉన్న కల్వకుర్తి ప్రాజెక్టు పూర్తి చేయలే..
- కాంగ్రెస్ హయాంలో అభివృద్ధి చెందితే..తెలంగాణ ఎందుకు ఏర్పడేది..
- రేవంత్ రెడ్డిపై మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ఫైర్..



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్

**మహబూబ్‌నగర్ ప్రతినిధి, మే 26, ప్రభాతవార్త :** జడ్చర్ల జరిగిని బహిరంగ సభలో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి మాటలు హాస్యాస్పదంగా ఉన్నాయని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ దుయ్యబట్టారు. ఈ సందర్భంగా మహబూబ్‌నగర్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మంత్రి రేవంత్‌పై ఫైర్ అయ్యారు. స్వాతంత్రం వచ్చినప్పటి నుంచి ఆపార్టీ అధికారంలో ఉన్నదనేది మర్చిపోయారా ప్రశ్నించారు. మరి అప్పట్లోనే పాలమూరు అన్ని రంగాల్లో ఏర్పాటు చేసి ఉంటే తెలంగాణ ఏర్పాటు ఎందుకు వచ్చేదన్నారు. పాలమూరును వలసకు చిరునామాగా మార్చిన ఘనత ఆ పార్టీ పాలకులదే అన్నారు. 14 రోజులకు ఒకసారి తాగునీరు వచ్చే పరిస్థితి కాంగ్రెస్ వల్లే దాపురించిందన్నారు. కేసీఆర్ సీఎం అయ్యాకే పాలమూరుకు నిత్యం నీరు వస్తుందని, వ్యవసాయానికి ఉచిత 24గంటల కరెంట్ అందుతుందన్నారు. పంటలకు పెట్టుబడి అందిస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అని చెప్పారు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల్లో రైతుబంధు ఎందుకు లేదో చెప్పాలన్నారు. ఉమ్మడి జిల్లాలో 2014కు ముందు కేవలం 30 హాస్టళ్లు మాత్రమే ఉంటే ప్రస్తుతం 140 గరుకుల విద్యాలయాలను ఏర్పాటు చేసిన ఘనత తెలంగాణ ప్రభుత్వానిదే అన్నారు. ప్రతి పాఠశాలను ఇంటర్ డిగ్రీ కళాశాలలుగా అప్‌గ్రేడ్ చేస్తామని సీఎం కేసీఆర్ ఇచ్చిన మాట ప్రకారమే చేసి చూపిస్తున్నామన్నారు. 2014కు ముందుకు మీరూ నెలకు రూ.10కోట్ల పింఛన్లు మాత్రమే ఇస్తే మేము రూ.106 కోట్లు ఇస్తున్నామన్నారు. పేదల పెండ్లిళ్లకు మీరు ఇచ్చింది శూన్యమని ఆడబిడ్డల పెండ్లిళ్లకు రూ.లక్షా నూటపదహారు అందజేస్తున్నా ఘనత మాదే అన్నారు. కాంగ్రెస్ హయాంలో భూమి పూజ చేసి వదిలేసిన ప్రాజెక్టులను మా హయాంలో రన్నింగ్‌గా మార్చామన్నారు. స్వాతంత్రం వచ్చినప్పటి నుంచి పాలమూరులో కేవలం 2లక్షల ఎకరాలకు సాగునీరందిస్తే , తొమ్మిదేండ్లలో 8లక్షల ఎకరాలకు సాగునీరు అందించామన్నారు. కేవలం 2టీఎంసీల సామర్థ్యం ఉన్న కల్వకుర్తి ఎత్తిపోతల పథకాన్ని కూడా కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తి చేయలేదన్నారు. పాలమూరు - రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో భాగంగా సుమారు 70 టీఎంసీల సామర్థ్యంలో 5 రిజర్వాయర్లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. సాగు,తాగు నీరందించి వలసలు వాపస్ వచ్చేలా చేశామన్నారు. పెద్ద ఎత్తున పరిశ్రమలు ఏర్పాటు చేసి స్థానికంగానే యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించే చర్యలు తీసుకుంటున్నామన్నారు. పేద వర్గాల ప్రజలను అగౌరవ పరిచేలా వారిని కులం పేరుతో తక్కువ చేసి మాట్లాడడం సరికాదన్నారు. చిన్న కులాలపై ఎందుకంత కసి, బడుగు బలహీన వర్గాలకు చెందిన వారిని పిచ్చగుంట్ల వారు అని హేళన చేస్తారా..ఆ కులంలో పుట్టడం వారు చేసుకున్న పాపమా అని ప్రశ్నించారు. సురవరం ప్రతాపరెడ్డి పుట్టిన నేల ఇది.వారిని ఆదర్శంగా తీసుకుని మనం హుందాగా ఉండాలన్నారు. ముఖ్యమంత్రి వయస్సెంత నీ వయస్సెంత.. ఇష్టారీతిగా మాట్లాడుతావా.. ఆనాడు సోనియాగాంధీని దయ్యం అన్నావు.. నేడు దేవత అంటున్నావు..రేపు ఏమంటావో తెలియదు..మేము మా జిల్లాను ఎలాంటి మతకలహాలు లేకుండా ఆత్మగౌరవంతో బతికేలా ముందుకు సాగుతున్నామన్నారు.

**మహబూబ్‌నగర్ ప్రభుత్వ వైద్య కళాశాలు అదనంగా 32 పోస్టులు మంజూరు..**

ఉస్మానియా, గాంధి ఆసుపత్రుల తర్వాత స్థానంలో ఉన్న మహబూబ్‌నగర్ ప్రభుత్వం వైద్య కళాశాలకు రాష్ట్ర ప్రభుత్వం 32 అదనపు పోస్టులను మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి డా.వి. శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. శుక్రవారం ఆయన మహబూబ్‌నగర్‌లో మీడియాతో మాట్లాడుతూ మహబూబ్‌నగర్ ప్రభుత్వ వైద్య కళాశాల రాష్ట్రంలోనే 3వ స్థానంలో ఉందని, ఇప్పుడు ఈ అదనపు పోస్టులు వచ్చిన తర్వాత భవిష్యత్తులో మొదటి స్థానానికి వస్తుందన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.రాష్ట్ర ముఖ్యమంత్రి, వైద్యారోగ్యశాఖ మంత్రి హరీష్‌రావులతో మాట్లాడి జిల్లాకు అదనంగా 32 పోస్టులను తెచ్చినట్లు ఆయన వెల్లడించారు. దీనిద్వారా మహబూబ్‌నగర్ ప్రభుత్వ వైద్య కళాశాలలో ఎంబిబిఎస్‌తో పాటు, పిజి విద్యను అభ్యసించే విద్యార్థులకు ఎంతో మేలు కలుగుతుందని ఆయన అన్నారు. ఈ 32 పోస్టులలో అనాటమి, ఫిజియాలజీ,బయోకెమిస్ట్రీ, పాతాలజీ, మైక్రోబయాలజీ, ఫోరెన్సిక్ మెడిసిన్, కమ్యూనిటి మెడిసిన్, జనరల్ మెడిసిన్, పిడియాట్రిషియన్, డివిఎల్, సైకియాట్రిస్ట్, జనరల్ సర్జరీ, ఆర్థోపెడిస్ట్ ఈఎన్‌టి,ఓబీజీ, అనిస్తీషియా, ఆసుపత్రి అడ్మినిస్ట్రేషన్ పోస్టులు ఉన్నట్లు మంత్రి వెల్లడించారు. మహబూబ్‌నగర్ ప్రభుత్వ వైద్య కళాశాలకు 32 పోస్టులు అదనంగా మంజూరు చేయడం పట్ల ఆయన రాష్ట్ర ముఖ్యమంత్రి కె. చంద్రశేఖర్‌రావు, వైద్యారోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీష్‌రావులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

# జూన్ 6న జిల్లాకు సీఎం కేసీఆర్ రాక...

**- నూతన కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయం, మెడికల్ కళాశాల, బీఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయాల ప్రారంభం:ఎమ్మెల్యే మర్రి జనార్ధన్‌రెడ్డి**



ఎమ్మెల్యే మర్రి జనార్ధన్‌రెడ్డి

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, మే 26 ప్రభాతవార్త:** సీఎం కేసీఆర్ జూన్ 6వ తేదీన నాగర్‌కర్నూల్ జిల్లా సమీకృత కలెక్టరేట్ భవన సముదాయాన్ని, జిల్లా ఎస్పీ కార్యాలయం,మెడికల్ కళాశాల, బీఆర్ఎస్ పార్టీ జిల్లా కార్యాలయాన్ని ప్రారంభిస్తారని ఎమ్మెల్యే మర్రి జనార్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. 2016 దసరారోజున నాగర్‌కర్నూల్ జిల్లాగా ఏర్పడిందన్నారు. జిల్లా ప్రజల దశాబ్దాల ఆకాంక్షను సీఎం కేసీఆర్ సాకారం చేశారని పేర్కొన్నారు. జిల్లా కలెక్టరేట్ రూ.50కోట్లతో నిర్మించామని, ఆధునిక శైలితో సకల సదుపాయాలతో కలెక్టరేట్ భవనం ఇతర రాష్ట్రాల సచివాలయాలను తలపిస్తుందని పేర్కొన్నారు. ప్రజలకు కలెక్టర్ అన్నిశాఖల అధికారులు అందుబాటులో ఉంటారని, పరిపాలన వేగవంతమవుతుందన్నారు.ఎస్పీకార్యాలయం,మెడికల్ కళాశాల, బీఆర్ఎస్ పార్టీ జిల్లాకార్యాలయాన్ని ప్రారంభించనున్నట్లు తెలిపారు.గతంలో తాను ఇచ్చిన జిల్లా ఆవిర్భావం హామీని అమలు చేసి కలెక్టరేట్ భవన సముదాయ ప్రారంభానికి సీఎం రావడం సంతోషకరమన్నారు. సీఎం రాక సందర్భంగా భారీ సభతో పాటుగా ప్రజల తరుపున ఘన సన్మానానికి ఏర్పాట్లు చేపడుతామని తెలిపారు.

# సొంత జాగా ఉంటే రూ.3లక్షలు..

- స్థలం కూడా లేనివారికి డబుల్ బెడ్రూం ఇల్లు..
- నిజమైన అర్హులైన ఎంపికే లక్ష్యంగా..
- 17, 20 వ వార్డుల్లో ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి పర్యటన





కాలనీల్లో పర్యటిస్తూ వివరాలు సేకరిస్తున్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

**మహబూబ్‌నగర్ ప్రతినిధి, మే 26, ప్రభాతవార్త :** రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా డబుల్ బెడ్రూం ఇండ్లకు నిజమైన అర్హులను ఎంపిక చేయడమే లక్ష్యంగా వార్డుల్లో స్వయంగా ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి పర్యటిస్తున్నారు. శుక్రవారం జడ్చర్ల మున్సిపాలిటీలోని 17,20వ వార్డుల్లో స్థానిక శాసన సభ్యుడు లక్ష్మారెడ్డి తాసిల్దార్ లక్ష్మీ నారాయణ, మున్సిపల్ కమిషనర్ మహెమూద్ షేక్‌తోపాటు ప్రజాప్రతినిధులతో కలిసి పర్యటన కొనసాగించారు. ఉదయం 7గంటల నుంచి మధ్యాహ్నం వరకు ఇంటింటికీ తిరుగుతూ వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలిసి తెలియక ఎవరికీ డబ్బులు ఇవ్వొద్దని గతంలో ఆ సంస్కృతి ఉండేదని చెప్పారు. అర్హులను ఎంపిక చేయడమే లక్ష్యంగా తానే స్వయంగా పర్యటిస్తున్నట్లు తెలిపారు. వారం రోజుల్లో ఎంపిక పూర్తి చేస్తామని వచ్చే నెల జూన్ 8న మంత్రి కేటీఆర్ చేత లబ్ధిదారులకు ఇండ్ల పట్టాలు అంద జేస్తామని తెలిపారు. ఎలాంటి పైరవీలకు తావులేకుండా లక్షల విలువ చేసే డబుల్ బెడ్రూం ఇండ్లను అత్యంత నిరుపేదలకే అందజేస్తామని స్పష్టం చేశారు. సొంత జాగా ఉంటే ఇల్లు కట్టుకోవడానికి రూ.3లక్షలు అందజేయనున్నట్లు చెప్పారు. అదేవిధంగా నేడు 27న శనివారం వంద పడకల దవాఖానను మంత్రి హరీశ్‌రావు చేతులమీదుగా ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. అన్ని రకాల సౌకర్యాలు, వసతులు కల్పించామని శనివారం నుంచే ప్రజలకు పూర్తి స్థాయిలో సేవలు అందుబాటులోకి వస్తాయన్నారు. ఎమ్మెల్యే వెంట మున్సిపల్ చైర్‌పర్సన్ దోరెపల్లి లక్ష్మీరవీందర్, వైస్‌చైర్‌పర్సన్ సారికారామ్మోహన్, కౌన్సిలర్లు కోట్ల ప్రశాంత్‌రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ పిట్టల మురళి, ఏఎంసీ వైస్ చైర్మన్ దానిష్,నాయకులు దోరెపల్లిరవీందర్,దామోదర్,సూరి పాల్గొన్నారు.

# నకిలీ పత్తి విత్తనాలు పట్టివేత..!

**23 క్వింటాళ్ల పత్తివిత్తనాలు పట్టివేత**

**ఫెయిల్ అయిన విత్తనాలు క్రష్ చేసి ఇవ్వడం కంపెనీలకు తెలియదా ?**

**ఓ ప్రముఖ కంపెనీపై అనుమానాలు వ్యక్తం చేస్తున్న రైతులు**



భారీగా పట్టుబడ్డ నకిలీ విత్తనాలు

**గద్వాల ప్రతినిధి, మే 26 ప్రభాతవార్త :** జోగులాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండలం లోని ఆయా గ్రామాలలో రైతుల నుంచి సుమారు 23 క్వింటాళ్ల నకిలీ పత్తి విత్తనాలను శుక్ర వారం టాస్క్‌ఫోర్స్ టీం స్వాధీనం చేసుకున్నాయి. వీటి విలువ సుమారు రూ.2 కోట్లు అంచనా. ఇంత పెద్ద మొత్తంలో నకిలీ విత్తనాలు దొరకడం పలు అనుమానాలకు దారితీస్తోంది. దేశంలోనే నడిగడ్డ సీడ్ పత్తికి పేరుగాంచింది. రైతులు ఎక్కువగా సీడ్ పత్తినే ప్రధాన పంటగా సాగు చేస్తున్నారు. సుమారు 50 వేల ఎకరాలలో సీడ్ పత్తి సాగవుతుంది. రైతులు పండించిన సీడ్ పత్తి ఆర్గనైజర్ ద్వారా వివిధ కంపెనీలకు తరలిస్తుంటారు. అక్కడ జిన్నింగ్ చేసి దూదిని, విత్తనాలు వేరుచేస్తారు. డిలీంటింగ్ ప్రక్రియలో భాగంగా విత్తనాలు శుద్ధిచేస్తారు. శుద్ధిచేసిన విత్తనాలను తిరిగి పాకెట్లలో ప్యాక్‌చేసి తిరిగి మార్కెట్‌లో విక్రయిస్తారు. కాని డిలీంటింగ్ చేసిన విత్తనాలలో జీఓటి తక్కువగా ఉన్న విత్తనాలను క్రష్ చేస్తారు. జోగులాంబ గద్వాల జిల్లా పర్యావరణానికి ముప్పు వాటిల్లుతుందని డిలీంటింగ్ ప్రక్రియను నిలిపివేశారు. ఆయా కంపెనీలు డిలీంటింగ్ ప్రక్రియను ఇతర రాష్ట్రాలలో కొనసాగించి జీఓటి తక్కువగా ఉన్న విత్తనాలు ఫెయిల్ కింద పరిగణిస్తున్నారు. ఫెయిల్ అయిన విత్తనాలు ఇతర రాష్ట్రాలనుంచి గద్వాల జిల్లాలోకి రవాణా చేయడంపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఫెయిల్ అయిన - మిగతా2లో..

# తెలంగాణ రాష్ట్రంలో ప్రాజెక్టుల పేరుతో కోట్లు దండుకున్న కెసిఆర్ ..!

**గ్రామ గ్రామాలలో బిజెపి జెండాను ఆవిష్కరించిన జాతీయ బిజెపి ఉపాధ్యక్షురాలు డికె అరుణ**



మాట్లాడుతున్న బిజెపి జాతీయ ఉపాధ్యక్షురాలు డికె అరుణ



అంబేద్కర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న డికె అరుణ

**ధరూర్,మే26 ప్రభాతవార్త:** మండల పరిధిలోని ర్యాలంపాడు, మార్లబీడు,బూరెడ్డిపల్లి, చెన్నరెడ్డిపల్లి,ధరూర్, అల్వాలపాడు, కొత్తపాలెం, కోతులగిద్ద, జాంపల్లి, గ్రామాలలో బిజెపి జెండాను బిజెపి జాతీయ ఉపాధ్యక్షురాలు డికె అరుణ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డికె అరుణ మాట్లాడుతూ 9 ఏళ్లలో భూతద్దం పెట్టి చూసిన కనిపించిన అభివృద్ధి గజం స్థలం సేకరించలేని దద్దమ్మలకు ఓటు అడిగే హక్కు లేదన్నారు. నేను మంత్రిగా ఉన్నప్పుడే జరిగిన అభివృద్ధే తప్ప తొమ్మిదేళ్లలో అభివృద్ధి జరిగింద లేదు, ప్రతిపక్ష ఎమ్మెల్యేగా ఉండా జిల్లా సాధించా లేకుంటే పొద్దున లేచిన వెంబడే భుజాన బ్యాగ్ వేసుకుని వనపర్తికి బయలు దేరుతుంటిరి నెట్టెంపాడు ప్రాజెక్టు లేకుంటే ఈ ప్రాంతం ఎడారిగా మారేదన్నారు. గ్రామాల అభివృద్ధి కేంద్ర ప్రభుత్వ నిధులతోనే అందులో సిసి రోడ్లు, మధ్యాహ్న భోజన పథకం, అంగన్‌వాడి భవనం, పౌష్టికాహారం, వైకుంఠధామాలు, రైతు వేదికలు మొదలైనవి 9 సంవత్సరాల నుంచి ఎన్ని ఇండ్లు పట్టణంలో కట్టారో, రెండు పడకల గదులు ఎన్ని నిర్మాణం చేశారో తెలియజేయాలన్నారు. ఎన్నికలు వస్తేనే పథకాలు గుర్తుకొస్తాయి, గొర్రెలు, డబుల్ బెడ్‌రూంలు, రైతుబంధు, కళ్యాణ లక్ష్మి గుర్తుకు వస్తాయన్నారు. తెలంగాణ రాష్ట్రం వస్తే బంగారు తెలంగాణ కాలేదని, కెసిఆర్ కుటుంబం, పార్టీ కార్యకర్తలకు మాత్రమే బంగారు తెలంగాణగా మారిందన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంలో ప్రాజెక్టుల పేర్లతో కోట్లు దండుకున్న కెసిఆర్ పేదలకు న్యాయం జరగాలని జిల్లా ఉద్యమం చేసి జిల్లా సాధిస్తే ఈ ప్రాంత అభివృద్ధికి బాటలు వేసే జిల్లా అధికారులను ఇబ్బందులకు గురి చేసి వెళ్లగొట్టిన ఘనత నేటి బిఆర్ఎస్ నాయకుల తీరన్నారు. రాష్ట్రంలో రోడ్ల దుస్థితి దయనీయంగా మారడంతో పాటు గ్రామీణ రోడ్లు మరీ అధ్వానంగా ఉన్నాయన్నారు. తెలంగాణ వచ్చి తొమ్మిదేళ్లయిన ఒక్క ఆర్‌అండ్‌ఆర్ సెంటర్‌లో మూడు పైసల పనులు చేయలేదన్నారు. 90 శాతం పనులు పూర్తి చేసింది నేనే ఏళ్ల తర్వాత తూతూ మంత్రంగా రంగులేసి శిలాఫలకాలు ఏర్పాటు చేశారు. అన్ని ఆర్‌అండ్‌ఆర్ సెంటర్లకు స్కూలు గాని, డ్రైనేజీ గాని, రోడ్లు, సబ్ స్టేషన్లు, గుడి, గ్రామ సావిడి, లైట్లు అన్ని నేను మంత్రిగా ఉన్నప్పుడు చేసిన పనులే అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చెప్పుకునే ఒక్క పని చేసింది లేదన్నారు. ఎన్నికలు సమీపిస్తున్నందున ప్రజల ముందర ముఖం చెల్లదని గట్టు ఎత్తిపోతల పథకం పనులు ప్రారంభించారని చిన్నోనిపల్లి రిజర్వాయర్ పనులు ప్రారంభించానన్నారు. ఇన్నేళ్లయినా ర్యాలంపాడు, చిన్నోనిపల్లి గ్రామాల్లో ఆర్‌అండ్‌ఆర్ సెంటర్ కాలేదని ప్రశ్నించారు.

## ఊరకుంట చెరువు కట్టకు మరమ్మతు..

**- పనులను పర్యవేక్షించిన కౌన్సిలర్ కోట్ల ప్రశాంత్‌రెడ్డి**

**మహబూబ్‌నగర్ ప్రతినిధి, మే 26, ప్రభాతవార్త :** జడ్చర్ల మున్సిపాలిటీ పరిధిలోని పద్మావతీ కాలనీ,విద్యానగర్,పాతబజార్‌కు అనుసంధానంగా ఉన్న ఊరచెరువుకు కట్టకు స్థానిక 24వ వార్డు కౌన్సిలర్ కోట్ల ప్రశాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో మరమ్మతు పనులు చేపట్టారు. కట్టకు ఆనుకుని పెద్ద ఎత్తున చెట్లు పెరగడంతో వర్షాకాలంలో ఇబ్బంది లేకుండా ముందస్తు చర్యగా ముండ్ల చెట్లను జేసీబీ సాయంతో తొలగించారు. చెరువు కట్టపై రాత్రి సమయాల్లో యువకులు, మైనర్లు అసాంఘీక కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు స్థానికులు సమాచారం ఇవ్వడంతో తన దృష్టికి వచ్చిందని ఈ క్రమంలో ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాల్లో భాగంగా కౌన్సిలర్ ప్రశాంత్‌రెడ్డి తన సొంత నిధులతో పిచ్చి,ముండ్ల చెట్ల తొలగించారు. ముండ్ల చెట్లను తొలగించడంపై కాలనీ వాసులు జీనురాల సత్యం, దాచేపల్లి నరేష్, రవితోపాటు కాలనీలోని పలు పాఠశాలల యాజమా న్యాలు హర్షం వ్యక్తం చేశాయి.



చెరువు కట్టపై ముండ్ల చెట్లను తొలగిస్తున్న దృశ్యం

## మంత్రి సహకారంతోనే నాగసానిపల్లి గ్రామ అభివృద్ధి

**శ్రీరంగాపురం,మే 26 ప్రభాతవార్త:** మండల పరిధిలోని నాగసానిపల్లి గ్రామంలో శుక్రవారం అండర్ డ్రైనేజీ పనులను సర్పంచ్ ఆంజనేయులు నాయుడు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఈ పనులను 25 లక్షల వ్యయంతో ప్రారంభించామని , రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి సహకారంతో గ్రామం ఎంతో అభివృద్ధి చెందుతుందని, ఇప్పటి వరకు గ్రామంలో సీసీ రోడ్లు, డ్రైనేజీలు, నాగసానిపల్లి నుండి శ్రీరంగాపురం మండల కేంద్రం వరకు బీటీ రోడ్డు పనులు జరుగుతున్నాయన్నారు. నాగసానిపల్లి ఊరు మొదట్లో అలుగులో వంతెన నిర్మాణం పూర్తయిందని, ఇంకా గ్రామానికి మరెన్నో మంజూరు చేశారని, గ్రామం తరపున మంత్రి నిరంజన్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాఘవేందర్, చరణ్, శ్రీనివాసులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.



అండర్ డ్రైనేజీ పనులను
పరిశీలిస్తున్న గ్రామ సర్పంచ్ ఆంజనేయులు నాయుడు

## వాల్మీకి, బోయల సంక్షేమానికై ఫెడరేషన్ ఏర్పాటు చేసి ఉపాధి కల్పించాలి

**నడిగడ్డ హక్కుల పోరాట సమితి ధరూర్ మండల అధ్యక్షుడు నెట్టెంపాడు గోవింద్**

**ధరూర్, మే 26 ప్రభాతవార్త :** మండల కేంద్రంలో తహసిల్దార్ కార్యాలయ ఆవరణలో వాల్మీకి బోయల సంక్షేమానికై ఫెడరేషన్ ఏర్పాటు చేసి ఉపాధి కల్పించాలని తహసిల్దార్ నరేష్‌కు నడిగడ్డ పోరాట హక్కుల సమితి ధరూర్ మండల అధ్యక్షుడు గోవింద్ వినతి పత్రం సమర్పించారు. ఆయన మాట్లాడుతూ ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోనే అత్యధికంగా ఉన్న వాల్మీకి బోయ కులస్తులకు ఎలాంటి ప్రత్యేకమైన వృత్తులు లేవని గతంలో సంచార జాతులుగా ఉన్నటువంటి వాల్మీకి, బోయలకు ప్రత్యేక ఫెడరేషన్ ఏర్పాటు చేసి నిధులు కేటాయించి అర్హత కలిగిన 18 సంవత్సరా లు నిండిన రపతి ఒక్కరికి వీరి ఉపాధి, సంక్షేమానికై రెండు లక్షల రూపాయలు కేటాయించాలని విజ్ఞప్తి చేస్తూ మండల తహసిల్దార్ కార్యా లయంలో తహసిల్దార్ ఎం.నరేష్‌కు వినతి పత్రం సమర్పించారు.కార్యక్రమంలో నడిగడ్డ హక్కుల పోరాట సమితి జిల్లా నాయకులు రంగస్వామి, పరుషరాముడు, వెంకట్రాములు, ధరూర్ మండల ఉపాధ్యక్షుడు మునెప్ప, కార్యదర్శి రాము, ఆర్గనైజింగ్ సెక్రెటరీ శాంతన్న, సహాయ కార్యదర్శి రామ కృష్ణ,మద్దిలేటి, నర్సింహులు, నాయకులు జగదీష్, క్రిష్ణ, మల్దకల్ మండల అధ్యక్షుడు విష్ణు, గట్టు మండల అధ్యక్షుడు బలరాంనాయుడు, కెటిదొడ్డి మండల నాయకులు అంజి, నాయకులు జమ్మన్న, డానియేలు, లక్ష్మన్న, చిన్నరాముడు, ఆశన్న, రాము, నర్సింహులు, భాస్కర్ పాల్గొన్నారు.



తహసిల్దార్‌కు వినతి పత్రం సమర్పిస్తున్న దృశ్యం

## జన్మదిన వేడుకల్లో పాల్గొన్న జడ్పీటీసీ, ఎంపీపీ

**అడ్డాకుల,మే 26 ప్రభాతవార్త:** మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు శ్రీనివాస్‌రెడ్డి మనుమరాలు చిన్నారి దివికారెడ్డి మొదటి జన్మదిన వేడుకల్లో జడ్పీటీసీ నల్లమద్ది రాజశేఖర్‌రెడ్డి, ఎంపీపీ నాగార్జునరెడ్డి పాల్గొని చిన్నారని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో అధ్యక్షుడు జితేందర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, మండల రైతు బంధు సమితి అధ్యక్షుడు తిరుపతిరెడ్డి, మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు జయన్నగౌడ్, కందూరు దేవస్థానం కమిటీ చైర్మన్ రమేష్ గౌడ్, మండల కో ఆప్షన్ ఖాజా గోరి, ఎంపీటీసీ రంగన్న గౌడ్, అడ్డాకుల టౌన్ అధ్యక్షుడు శ్రీనివాస్ యాదవ్, నాయకులు సూర్య మోహన్‌రెడ్డి, మహేష్ యాదవ్, రాజవర్ధన్‌రెడ్డి, ప్రచార కమిటీ అధ్యక్షుడు జాజాల రాజేశ్వర్‌రెడ్డి, గ్రామ రైతు కోఆర్డినేటర్ బొడ్డు రమేష్,నాయకులు విజయ్‌కుమార్,వెంకటేష్ ,రాములు తదితరులు పాల్గొన్నారు.



జన్మదిన వేడుకల్లో పాల్గొన్న జడ్పీటీసీ, ఎంపీపీ

## మంత్రి సహకారంతో బీటీ రోడ్డు నిర్మాణం పూర్తి

**- రాజాపేట తాండ సర్పంచ్ జయరాములు నాయక్**

**వనపర్తి రూరల్,మే 26 ప్రభాతవార్త:** మండల పరిధిలోని రాజపేట పెద్దతాండ గ్రామానికి రోడ్డు పని పూర్తయిందని సర్పంచ్ జయ రాములు నాయక్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి చొరవతో రాజపేట పెద్దతాండలో సీఆర్ఆర్ నిధుల ద్వారా రాజపేట గ్రామం నుండి పెద్దతాండ (ఆర్) వరకు కోటి 15 లక్షల రూపాయలతో గత ఏడాది నిర్మాణం చేపట్టిన బీటీ రోడ్డు పనులు పూర్తయ్యాయని గడువులోగా పనులు పూర్తి చేయడం ఆనందంగా ఉందని పేర్కొన్నారు. తాండలోని పలు అభివృద్ధి కార్యక్రమాలకు సహకరిస్తున్న మంత్రికి సర్పంచు, ప్రజలు ప్రత్యేక అభినందనలు తెలిపారు. ముగింపు పనులను జిల్లా డీఈ అశోక్ పర్యవేక్షించారు.ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు శంకర్ నాయక్ పాల్గొన్నారు.



పూర్తయిన బీటీ రోడ్డు నిర్మాణం

## సీఎం కప్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులను అభినందించిన జడ్పీటీసీ

**అడ్డాకుల,మే 26 ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా అట్టహాసంగా ప్రారంభించిన సీఎం కప్ 2023 క్రీడా పోటీల్లో అడ్డాకుల మండల కేంద్రానికి చెందిన క్రీడాకారులు నైపుణ్యం ప్రదర్శించి జిల్లాస్థాయి కబడ్డీ పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులను జడ్పీటీసీ నల్లమద్ది రాజశేఖర్‌రెడ్డి అభినందించారు. రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికైన ముగ్గురు క్రీడాకారులు కిరణ్ యాదవ్, పాండు నాయక్, కౌశిక్ లను ప్రత్యేకంగా అభినందించి శాలువాతో సన్మానించి సత్కరించి, ప్రోత్సాహక బహుమతి రూ.10వేలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సింగిల్‌విండో అధ్యక్షుడు జితేందర్‌రెడ్డి, మండల కో ఆప్షన్ ఖాజా గోరి, గ్రామ పెద్దలు రాములు, మండల యూత్ అధ్యక్షుడు బాలరాజు, గ్రామ రైతు కోఆర్డినేటర్ బొడ్డు రమేష్, వెంకటేష్, శ్రీను, శాంతన్న, దేవన్న, క్రీడాకారులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.



రాష్ట్రస్థాయికి ఎంపికైన క్రీడాకారులకు ఆర్థిక సాయం
అందజేస్తున్న జడ్పీటీసీ నల్లమద్ది రాజశేఖర్‌రెడ్డి

# మున్సిపాలిటీ వైపు...దేవరకద్ర అడుగులు..!

- త్వరలో దేవరకద్రకు మున్సిపాలిటీ హోదా..
- మున్సిపాలిటీ కమీషనరేట్‌కు చేరిన ఫైల్
- 4 గ్రామలు కలిపి ప్రతిపాదనలు
- నెరవేరిన కేటీఆర్ హామి
- ఫలిచిన ఎమ్మెల్యే ఆల కృషి
- మరింత అభివృద్ధి చెందడానికి అస్కారం
- ఆనందంలో పట్టణ ప్రజలు



దేవరకద్ర పట్టణ ముఖ చిత్రం

**దేవరకద్ర,మే 26 ప్రభాతవార్త:** దేవరకద్రకు త్వరలో మున్సిపాలిటీ హోదా లభించనుంది. ఎట్టకేలకు పట్టణవాసుల కల నేరవేరే సమయం దగ్గరలోనే ఉంది. ప్రజాప్రతినిధులు,అధికారుల సమిష్టి కృషి ఫలితంగా ఇది సాధ్యకానుంది. మున్సిపాలిటీ వైపు దేవరకద్ర అడుగులుపడుతున్నాయి. దేవరకద్రను మున్సిపాలిటీగా మార్చడానికి చేసిన ప్రతిపాదన ఫైల్ ఇదివరకే మున్సిపల్ కమీషనరేట్‌కు చేరింది. ఇంకా కేవలం కొన్ని నెలల్లోనే దేవరకద్రకు మున్సిపాలిటీ హోదా రానుంది. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాను 5జిల్లాలుగా విభజించిన తరువాత జిల్లాలో మహబూబ్‌నగర్,జడ్చర్ల,దేవరకద్ర నియోజకవర్గాలు మాత్రమే మిగిలాయి. ఇందులో మహబూబ్‌నగర్,జడ్చర్లలు ఇదివరకే మున్సిపాలిటీలుగా మారాయి. అయితే దేవరకద్ర నియోజకవర్గంలోని కొత్తకోట,భూత్పూర్‌లను కూడ మున్సిపాలిటీలుగా మారాయి. ఇకపోతే అదే తరహాలో దేవరకద్రను కూడ మున్సిపాలిటీ హోదా కల్పించడానికి కసరత్తును ప్రారంభించి పూర్తిచేశారు. ముఖ్యమంత్రి కేసీఆర్,మంత్రి కేటీఆర్‌ల సహకారంతో ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి ఈ విషయంలో చేసిన కృషి ఫలించింది. ఎమ్మెల్యే ఆల సూచనమేరకు దేవరకద్రను మున్సిపాలిటీగా మార్చడానికి కావలసిన సమాచారంతో సంబందించిన ఫైల్‌ను సిద్ధంచేసి కమీషనరేట్‌కు పంపించారు.దీంతో దేవరకద్రకు త్వరలో మున్సిపాలిటీ హోదా లబించనుంది.ఇది కార్యరూపం దాలిస్తే దేవరకద్ర ఓహాట్‌కేక్‌లా మారుతుంది.ఇప్పటికే దాదాపు రూ.24కోట్లతో నిర్మించిన ఆర్ఓబి వంతెనను ప్రారంభించారు.దీంతో దేవరకద్రకు మహార్ధశ రాబోతుంది. దేవకద్ర మున్సిపాలిటీగా మారుస్తుండటంతో పట్టణ ప్రజలు అనందం వ్యక్తపరుస్తున్నారు.ఎమ్మెల్యే కృషిని కొనియా డుతున్నారు.

**నెరవేరిన మంత్రి కేటీఆర్ హామీ..** భూత్పూర్‌లో గత ఏడాది జరిగిన ఓ బహిరంగసభలో మున్సిపాల్ శాఖ మంత్రి కేటీఆర్‌కు దేవరకద్రకు మున్సిపాలిటీ హోదా కల్పించాలని ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడి వినతిపత్రం సమర్పించారు. దీనిక స్పందించిన మంత్రి కేటీఆర్ దేవరకద్రను మున్సిపాలిటీ మార్చడానికి అప్పట్లోనే స్పష్టమైన హామి ఇచ్చారు.అప్పటి పరిస్థితుల దృష్ట్యా దేవరకద్రను ఏడాది తరువాత మున్సిపాలిటీగా మారు స్తామని చెప్పారు. అయితే కేటీఆర్ చెప్పి ఏడాది అవుతున్న తరు ణంలో దీనికి స్పందించన పనులు చకచక సాగాయి. రెండు నెలల్లో దేవరకద్రను మున్సిపాలిటీగా మారే ఆవకాశం స్పష్టంగా కనిపిస్తుంది.ఆదిశగా అడుగులు వడివడిగా పడుతున్నాయి.

**దేవరకద్రలో 4 గ్రామాలు విలీనం..**
దేవరకద్ర మున్సిపాలిటీ పరిదిలో మండలంలోని 4 గ్రామాలు విలీనం చేయనున్నారు.15వేలజనాభాతో మున్సిపాలిటీని ఏర్పాటు చేసే అవకాశం ఉండటంతో దేవరకద్ర సమీపంలోని పెద్దగోప్లాపూర్, బల్సు పల్లి,మీన్గవానిపల్లి,చౌదర్‌పల్లిగ్రామాలను విలీనం చేయాలని నిర్ణయించారు. ఈ గ్రామాల జనాభాను తీసుకొంటే మున్సిపాలిటీ నిబందనల ప్రకారం జనాభ సరిపోతుండటంతో ఆయా గ్రామాల నుండి అధికారులు తీర్మానాలు తీసుకొని దేవరకద్రను మున్సి పాలిటీగా మార్చే ఫైల్‌ను సిద్దం చేసి మున్సిపాలిటీ కమీషనరేట్ పంపించారు.



**దేవరకద్ర అభివృద్ధికి ఆస్కారం:**
మున్సిపాలిటీగా మారితే దేవరకద్ర మరింత అభివృద్ధి చెందడానికి అస్కారమేర్పడుతుంది. అన్ని వసతులు సమకూరుతాయి. అంతేగా కుండా దేవరకద్రకు మహార్ధశ వస్తుంది. మండలంలోని ఆయా గ్రామాలు కూడ అభి వృద్ధి చెందే అవకాశం ఉంది.దీని వెనుక ఎమ్మెల్యే ఆల కృషి చాలాఉంది. ఈ నిర్ణయంతో వెనుకబాటుతనం పూర్తిగా తొలగిపోతుంది.ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్ సహకారం దీనికి తోడైంది.ప్రభుత్వం పనితీరు ప్రజలకు అద్దంపట్టిం ది.దేవరకద్రను మున్సిపాలిటీ మారుస్తుండటంతో పట్టణ ప్రజల తరపున ఎమ్మెల్యే ఆలకు ప్రత్యేక కృతజ్ఞతలు.

*కెంగూరి రమాశ్రీకాంత్‌యాదవ్, యంపీపీ, దేవరకద్ర..*

**హాట్‌కేక్‌ల మారనున్న దేవరకద్ర:**



దేవరకద్రను మున్సిపాలిటీగా మారుస్తుండటంతో పట్టణ ప్రజల కల త్వరలో నెరవేరనుంది. ఎన్నో రోజులుగా దీనికోసం ఎదురు చూస్తున్నాం. ఆ సమయం రానేవచ్చింది. ఈ విషయంలో మంత్రి కేటీఆర్ ఇచ్చిన మాటను నిలబెట్టుకొన్నారు. ఎమ్మెల్యే ఆల చొరవతోనే ఇది సాధ్యమైంది.మున్సిపాలిటీగా మారితే దేవరకద్ర ఓ హాట్‌కేక్‌లా మారుతుంది. అభివృద్ధి కొత్త పుంతలు తొక్కుతుంది.దీంతో ముఖ్యమం త్రికి,మంత్రి,ఎమ్మెల్యేలకు మండల ప్రజల తరపున ధన్యవాధాలు. అభివృద్ధికి ప్రభుత్వం ఏ విధంగా పాటుపడుతుందో ప్రజలకు అర్థమైంది.

*జెట్టినరసింహ్మారెడ్డి, దేవరకద్ర మండలం బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు..*

## జిల్లాలో ఘనంగా దశాబ్ది ఉత్సవాల నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు : గద్వాల జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి



జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి

**గద్వాల ప్రతినిధి, మే 26 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల నిర్వహణపై సంబంధిత అధికారులతో శుక్రవారం జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించతలపెట్టిన తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల కార్యక్రమం జూన్ 2 నుండి 22 వరకు (21) రోజులు జరిగే కార్యక్రమాలకు జిల్లా అధికారులు సిద్ధంగా ఉండాలని సూచించారు. ప్రతి కార్యక్రమానికి ఒక ప్రత్యేక అధికారిని నియమించి రోజువారి కార్యక్రమం విజయవంతం చేయుటకు జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉండాలని, 9 ఏళ్లలో జిల్లా ప్రగతిపై అన్ని శాఖల అధికారులు వివరాలు సమర్పించాలని ఆదేశించారు. శాఖలవారిగా కార్యాచరణ ప్రణాళిక సిద్ధం చేసుకుని రావాలన్నారు. ప్రజా ప్రతినిధులు, ప్రజలు హాజరయ్యేలా చూడాలన్నారు. మండల కార్యాలయాలు అందంగా పూల తోరణాలతో సిద్ధం చేయాలన్నారు. 21 రోజులపాటు జరిగే దశాబ్ది ఉత్సవాలకు అన్ని శాఖల అధికారులు పూర్తి ప్రణాళికతో ఉండాలన్నారు. పల్లె ప్రగతి, పట్టణ ప్రగతి ముందు తర్వాత జరిగిన పనులపై నివేదిక సిద్ధం చేసుకోవాలన్నారు. ప్రతి కార్యక్రమానికి దశాబ్దిలోగా ఉండాలన్నారు. ఇరిగేషన్‌శాఖ వారు చెరువుల దగ్గర చెరువుల అభివృద్ధిపై వివరించి, మత్స్య శాఖ చేపలు పట్టే వారిని ఊరేగింపుగా తీసుకెళ్లి చెరువు కట్టల దగ్గర భోజనాలు పెట్టాలన్నారు. ఇళ్ల పట్టాలు అందజేసేందుకు సిద్ధం చేయాలన్నారు. 75 చదరపు గజాల ఇంటిస్థలం ఉండేందుకు లే అవుట్ తయారు చేసి పట్టాలు పంపిణీకి సిద్ధం చేయాలన్నారు. షాదీముబారక్, కళ్యాణలక్ష్మి చెక్కులు పంపిణీకి ఏర్పాటు చేయాలనానరు. కులవృత్తుల వారిని గుర్తించి వారి పేర్లు నమోదు చేయాలన్నారు. 9 సంవత్సరాల తెలంగాణలో జరిగిన వివిధ శాఖల అభివృద్ధిపై ఆయాశాఖలో పూర్తిస్థాయిలో నివేదికలో సిద్ధం చేసుకుని రావాలన్నారు. ఈ టెలికాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ అపూర్వ చౌహాన్, ఆర్డీఓ రాములు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

**తెలంగాణ దశాబ్ది ఉత్సవాల షెడ్యూల్...**
జూన్ 2న అన్ని జిల్లాల్లో జాతీయ పతాకావిష్కరణ, జూన్ 3న రైతు దినోత్సవం,జూన్ 4న పోలీసుల ఆధ్వర్యంలో సురక్షాదినోత్సవంజూన్ 5 విద్యుత్ విజయోత్సవం, జూన్ 6న పారిశ్రామిక ప్రగతి ఉత్సవం,జూన్ 7న సాగునీటి దినోత్సవం, జూన్ 8న ఊరూరా చెరువుల పండగ, జూన్ 9న సంక్షేమ సంబురాల నిర్వహణ,జూన్ 10న సుపరిపాలన దినోత్సవం, జూన్ 11న సాహిత్య దినోత్సవం, జూన్ 12న తెలంగాణ రన్ నిర్వహణ, జూన్ 13న మహిళా సంక్షేమ దినోత్సవం, జూన్ 14న వైద్యారోగ్య దినోత్సవం, జూన్ 15న పల్లె ప్రగతి దినోత్సవం, జూన్ 16న పట్టణ ప్రగతి దినోత్సవం, జూన్ 17న గిరిజనోత్సవం, జూన్ 18న మంచినీళ్ల పండుగ, జూన్ 19న హరితోత్సవం, జూన్ 20న విద్యా దినోత్సవం, 21న ఆధ్యాత్మిక దినోత్సవం, జూన్ 22న అమరుల సంస్మరణ దినోత్సవం నిర్వహించాలని కలెక్టర్ తెలిపారు.

## నకిలీ పత్తి విత్తనాలు పట్టివేత..!

**మొదటి పేజీ తరువాయి భాగం..**

విత్తనాలు మార్కెట్‌లో విక్రయించడంతో రైతులు వేసిన పంటకు దిగుబడి రాక అప్పుల బారిన పడి ఆత్మహత్యలు చేసుకున్న సందర్భాలున్నాయి. వీటిని అరికట్టేందుకు తెలంగాణ ప్రభుత్వం నకిలీ విత్తనాలను అమ్మేవారిపై నిఘా ఉంచి కేసులు నమోదు చేస్తుంది. నకిలీ విత్తనాల వల్ల రైతులు మోసపోకుండా టాస్క్‌ఫోర్స్, వ్యవసాయ అధికారులు అవగాహన కార్యక్రమాలు నిర్వహించి రైతులను చైతన్యం చేస్తున్నారు. ఎక్కడో ఒకచోట నకిలీ విత్తనాల వల్ల రైతులు మోసపోతున్నారు. నకిలీ పత్తి విత్తనాలు సరఫరా చేసే వారిపై పిడి యాక్ట్ నమోదు చేయడంతో నకిలీ పత్తి విత్తనాల బెడద కొంచెం తగ్గుముఖం పట్టింది.

**రైతులకు ఆ విత్తనాలు ఎలా వచ్చాయి..?**
జిఓటి తక్కువగా ఉన్న పత్తి విత్తనాలు మార్కెట్‌లో విక్రయిం చరాదని నిబంధన ఉంది. ఫెయిల్ అయిన విత్తనాలు క్రష్ చేసి రైతులకు ఇవ్వాల్సి వస్తుంది. మరీ ఓ ప్రముఖ కంపెనీ వారు ఫెయిల్ అయిన పత్తి విత్తనాలను క్రష్ చేయకుండా రైతులకు ఎందుకిచ్చారు. రైతులు పండించిన సీడ్‌లో ఏఏ లాట్ ఫెయిల్ అయిందో పూర్తి వివరాలు ఆయా శాఖల అధికారులకు జాబితా ఇచ్చినప్పుడు ఫెయిల్ అయిన విత్తనాలను ఎందుకు క్రష్ చేసి ఇవ్వలేదని అనుమానం కూడా ఉంది.



భారీగా పట్టుబడ్డ నకిలీ విత్తనాలు

**జిల్లా వ్యవసాయ అధికారి వివరణ....**
కావేరి సీడ్ కంపెనీకి చెందిన విత్తనాలు 33.54 క్వింటాళ్ల పత్తి విత్తనాలు, విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్, అధికారుల సమాచారం ద్వారా పోలీస్ సహకారంతో పట్టుకోవడం జరిగింది. ఆర్గనైజర్ ద్వారా రైతుకు పోయిన పత్తి విత్తనాలను రిటర్న్ తీసుకుని కంపెనీ నుంచి వచ్చిన వీటిపై తదుపరి చట్టపరంగా చర్య తీసుకుంటాము.

## హత్యాయత్నం కేసులో 5సంవత్సరాల జైలుశిక్ష..

**గద్వాల ప్రతినిధి, మే 26 ప్రభాతవార్త :** భార్యను అదనపు కట్నం కోసం మానసికంగా వేధించి భార్యను, మొదటి భార్యతో కలిసి కిరోసిన్ పోసి హత్యాయత్నం చేసిన కేసులో భర్తకు అతనికి సహకరించిన మొదటి భార్యకు, మొదటిభార్య మరిదికి 5 సంవత్సరాలు కఠిన కారాగార శిక్ష, ఒక్కొక్కరికి రూ. వెయ్యి రూపాయల జరిమాని విదిస్తూ గౌరవ అడిషనల్ అసిస్టెంట్ సెషన్స్ జడ్జి గద్వాల జి. ప్రభాకర్ తీర్పును వెల్లడించారు.తేది 10.11.2019న బాధితురాలు సాజిద, గ్రామం శాంతినగర్, శాంతినగర్ పోలీస్ స్టేషన్‌లో తన భర్త అయన ఎండి బషీర్ అహ్మద్ తండ్రి బడెసాబ్ (57) గ్రామం శాంతినగర్‌కు గతంలో దేవరకద్ర మండలం బస్వాపూర్‌కు చెందిన ఎండి ఫరిదా బేగంను ఇచ్చి పెళ్లిచేయగా వారికి పిల్లలు పుట్టకపోవడంతో 17 సంవత్సరాల క్రితం గద్వాలకు చెందిన తనను పెద్దల సమక్షంలో పెళ్లి చేసుకున్నాడని పెళ్లి అయిన రెండు నెలల తరువాత బతుకు దెరువు కోసం తన భర్త సౌదీ అరేబియా వెళ్లాడని, అప్పుడప్పుడు వచ్చి శాంతినగర్‌కు వచ్చి పోతూ ఉండేవారని, పెళ్లి అయిన 9 సంవత్సరాల నుండి అదనపు కట్నం కోసం వేధించడం ప్రారంభించగా తమ పుట్టింటి వారు సుమారు 4 లక్షలు ఇచ్చారని కొన్ని రోజులకు సౌదీ అరేబియా నుండి వచ్చినప్పుడల్లా అదనపు కట్నం కోసం తమను వేధించేవాడని ఆ క్రమంలో 20 రోజుల క్రితం తన భర్త సౌదీ అరేబియా నుండి ఇంటికి వచ్చి అదనపు కట్నంకోసం వేధిస్తూ 9.11. 2019న తను తన కుమారుడితో ఇంట్లో ఉండగా తన భర్త, మొదటి భార్య ఫరీదా బేగం, ఆమె మరిది గౌస్‌భాషా అందరు కలిసి తమతో గొడవ పెట్టుకుని కొట్టి గాయపరచగా, ఇంటి పక్కల వారు విడిపించారని, తరువాత కొంత సమయానికి ఆ ముగ్గురు మళ్లీ నా దగ్గరకు వచ్చి నా చేతులు పట్టుకుని తనపై కిరోసిన్ పోసి అగ్గిపెట్టె తీసి అంటించేందుకు ప్రయత్నించగా తను తన కొడుకుని తీసుకుని పరుగెత్తి కేకలు వేస్తూ రోడ్డుమీదు వెళ్లానని తమపై కిరోసిన్ పోసి హత్యాయత్నం చేసిన ఆ ముగ్గురిపై తగు చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు ఇవ్వగా వారి ఫిర్యాదు మేరకు శాంతినగర్ పోలీసులు క్రైమ్ నం. 135/2019 యు/ఎస్ 307 ఐపిసిగా కేసు నమోదు చేసుకుని అనంతరం విచారణ చేపట్టిన అప్పటి శాంతినగర్ ఎస్సై శ్రీహరి నిందితులు ఎ1, ఎండి బషీర్ అహ్మద్, ఎ2 ఎండి ఫరీదాబేగం ఎ3గా ఎండి గౌస్‌భాషాలు బాధితురాలును మానసికంగా వేధించి గొడవ పెట్టుకుని గాయపరిచి కిరోసిన్ పోసిహత్య చేసేందుకు ప్రయత్నించినట్లు విచారణలో నేరం రుజువు కావడంతో నేరస్తులను అరెస్టు చేసి జ్యుడిషియల్ రిమాండ్‌కు పంపించడం జరిగింది. ముగ్గురు నిందితులకు రూ. 1000 చొప్పున జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించారు. నేరస్తులకు జైలుశిక్ష పడడానికి పబ్లిక్ ప్రాసిక్యూటర్ వెంకట్రాములు, కోర్టు కానిస్టేబుళ్లు భాషా, కోర్టు లైజనింగ్ రఫీ సహకరించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ కేసు ఇన్వెస్టిగేషన్ అధికారి అప్పటి శాంతినగర్ ఎస్సై శ్రీహరిని ప్రస్తుత ఎస్సై శ్రీనివాస్‌ను పబ్లిక్ ప్రాసిక్యూటర్ వెంకట్రాములును కోర్టు కానిస్టేబుళ్లు భాషా కోర్టు లైజనింగ్ రఫీని జిల్లా ఎస్పీ అభినందించారు.



బాధితురాలితో పోలీస్ సిబ్బంది

## కాంగ్రెస్ శ్రేణుల్లో నూతన ఉత్సాహం..

**- సీఎల్పీ నేత భట్టిని సన్మానించిన డీసీసీ అధ్యక్షుడు జీఎంఆర్**



**మహబూబ్‌నగర్ ప్రతినిధి, మే 26, ప్రభాతవార్త :** సీఎల్పీ నేత భట్టి విక్రమార్క చేపట్టిన పీపుల్స్ మార్చ్ పాదయాత్ర శుక్రవా రంతో మహబూ బ్‌నగర్ జిల్లా జడ్చర్ల నియోజకవర్గంలో కిష్టంపల్లి వద్ద నాగర్‌కర్నూల్ జిల్లాలోకి ప్రవేశించింది. ఈ సంద ర్భంగా మల్లు భట్టి విక్రమార్కను డీసీసీ అధ్యక్షుడు జి మధుసూదన్‌రెడ్డి సన్మానించారు. కాంగ్రెస్ జెండాను నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షుడు వంశీకృష్ణకు అందజేశారు.అనంతరం జిల్లాలో పాదయాత్ర విజయవంతమైనందుకు భట్టి విక్రమార్కకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా జిఎంఆర్ మా ట్లాడుతూ పీపుల్స్ మార్చ్ పాదయాత్ర జిల్లాలో పార్టీ శ్రేణుల్లో కొత్త జోష్ నింపిందన్నారు. మరింత ఉత్సాహంతో రాహుల్ గాంధీ సందే శాలను ప్రజల్లోకి తీసుకెళ్తామని తెలిపారు. పార్టీ విజయానికి నిరం తరం శ్రమిస్తామన్నారు. జడ్చర్లలో జరిగిన సభకు కూడా అశేషజనం వచ్చారని చెప్పారు. కార్యక్రమంలో టీపీసీసీ ఉపాధ్యక్షుడు మాజీ ఎమ్మెల్యే ఎర్రశేఖర్ పాల్గొన్నారు.

## యువకుడి ఆత్మహత్య

**దేవరకద్ర,మే 26 ప్రభాతవార్త:** దేవరకద్ర మండలం డోకూర్ సమీపంలో శుక్రవారం ఓ యువకుడు రైలు కిందపడి ఆత్మహత్య చేసుకొన్నాడు.రైల్వే హెడ్‌కానిస్టేబుల్ టి.కృష్ణ కథనం ప్రకారం వివరాలు ఈ విధంగా ఉన్నాయి.మండలంలోని హాజిలాపూర్‌కు చెందిన జంగం కృష్ణయ్య(20) డోకూర్‌లోని తన పెద్దమ్మ వద్దకు వెళ్ళాడు. అయితే అక్కడ గ్రామ సమీపంలో కృష్ణయ్య రైలు కిందపడి ఆత్మహత్య చేసుకొన్నాడు.మృతుడు డిగ్రీ చదువుతున్నాడు.విషయం తెలుసుకొన్న రైల్వే పోలీసులు సంఘటన స్థలానికి వచ్చి శవపంచనామ నిర్వహించారు.అనంతరం పోస్టుమార్టమ్ నిమిత్తం జిల్లా ఆసుపత్రికి తరలించి ఈ సంఘటనపై కేసు నమోదుచేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే హెడ్‌కానిస్టేబుల్ టి.కృష్ణ తెలిపారు.

## దేవరకద్ర వ్యవసాయ మార్కెట్‌ధరలు

**దేవరకద్ర,మే26 ప్రభాతవార్త:** దేవరకద్ర వ్యవసాయ మార్కెట్ యార్డుకు శుక్రవారం 84 కింటాళ్ళ సోన ధాన్యాన్ని రైతులు విక్రయా నికి తీసుకవచ్చారు. అయితే కింటాల్ సోన ధాన్యానికి అత్యధికంగా రూ. 2039 ధర పలికింది. అలాగే అతి తక్కువగా రూ.1719 ధర పలికింది.అలాగే 3 కింటాళ్ళ హంస ధాన్యాన్ని రైతులు విక్రయానికి తీసుకవచ్చారు.కింటాల్ హంస ధాన్యానికి అత్యధికంగా రూ.1511 ధర పలికింది.అలాగే అతితక్కువగా కూడ అంతే ధర పలికింది. అలాగే 23కింటాళ్ళ ఆముదాలను రైతులువిక్రయానికి తీసుకవచ్చా రు.కింటాల్ ఆముదాలకు అత్యధికంగా రూ.5309 ధర పలికింది. అతితక్కువగా కూడ అంతే ధర పలికినట్లు మార్కెట్‌అధికారులు తెలిపారు.

## ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లాస్థాయి వ్యాసరచన, ఉపన్యాస, చిత్రలేఖన పోటీలు

**వనపర్తి ప్రతినిధి,మే 26 ప్రభాతవార్త:** తెలంగాణ స్టేట్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఆధ్వర్యంలో జూన్ 5వ తేదీన పర్యావరణ దినోత్సవం సందర్భంగా జిల్లాలోని 8,9, 10వ తరగతి విద్యార్థులకు పర్యావరణ పరిరక్షణ ప్రాధాన్యతపై జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ఆదేశాల మేరకు జిల్లాస్థాయి వ్యాసరచన, ఉపన్యాస , చిత్రలేఖన పోటీలు నిర్వహించడం జరుగుతుందని డీఈవో గోవిందరాజులు ఒక ప్రకటనలో తెలిపారు.ఈ పోటీలలో పాల్గొనే విద్యార్థులు గూగుల్ ఫామ్‌లో విద్యార్థుల వివరాలను ఈనెల 28వ తేదీ లోపు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ఆయన తెలిపారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న విద్యార్థులు మాత్రమే జిల్లాస్థాయి పోటీలలో ఈనెల 31వ తేదీన ఉదయం 8 గంటలకు బాలుర హై స్కూల్ లో హాజరు కావాలని తెలిపారు. వ్యాసరచన - పర్యావరణం కొరకు జీవిత విధానాలు, ఉపన్యాస పోటీ - ప్లాస్టిక్ కాలుష్యానికి పరిష్కార మార్గాలు , చిత్రలేఖన పోటీ - కాలుష్య ప్రభావాన్ని తగ్గించుటకు చెట్లను పెంచడం అంశాలపై పోటీ నిర్వహించడం జరుగుతుందని ఆయన తెలిపారు. జిల్లాస్థాయిలో విజేతలైన విద్యార్థులకు జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా బహుమతి ప్రధానోత్సవం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమానికి సమన్వయ కర్తలుగా జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాసులు, ఎన్‌జీసీ జిల్లా కోఆర్డినేటర్ సుదర్శన్ రావులు వ్యవహరిస్తారని ఆయన తెలిపారు.

## ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగ భవన నిర్మాణానికి, పట్టణ ఆర్యవైశ్య కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి నిధులు మంజూరు



నిధుల మంజూరు పత్రం అందజేస్తున్న మంత్రి నిరంజన్‌రెడ్డి

**వనపర్తి టౌన్,మే 26 ప్రభాతవార్త:** వనపర్తి పట్టణంలోని ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగ భవన నిర్మాణానికి రూ.5 లక్షలు, పట్టణ ఆర్యవైశ్య కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి రూ.10లక్షలు నిధులు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి మంజూరు చేయడంతో ఈ సందర్భంగా మున్సిపల్ వైస్ చైర్మన్,జిల్లా విశ్రాంత ఉద్యోగుల సంఘం గౌరవ అధ్యక్షుడు వాకిటి శ్రీధర్, ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగులు మంత్రిని శాలువాతో సన్మానించి, ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగులు మంత్రి నిరంజన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలవడంతో వనపర్తి విశ్రాంత ఉద్యోగుల సంఘం భవనం నిర్మాణం కొరకు వనపర్తి డెవలప్‌మెంట్ ఫండ్స్ నుండి రూ.5 లక్షల నిధుల మంజూరు అనుమతి పత్రం వాకిటి శ్రీధర్‌కు అందజేశారు. మంత్రి సానుకూలంగా స్పందిస్తు అర్హులైన వారందరికీ ఆసరా పెన్షన్స్, తెల్ల రేషన్ కార్డు, డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు, వైద్య సదుపాయం, భార్యభర్తల ఇరువురికి రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులతో సమానంగా వచ్చేట్లుగా ఏర్పాటు చేస్తానని, రాష్ట్ర డెలిగేషన్‌ను సీఎం వద్దకు తీసుకువెళ్తానని మంత్రి హామీ ఇచ్చారు. అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ గట్టు యాదవ్, టీఆర్ఎస్ నాయకులు ప్రేమ్‌నాథ్‌రెడ్డి, బొబ్బిలి ప్రేమ్ కుమార్, రామ్‌రెడ్డి, కార్యదర్శి సత్యన్నాచారి,కార్యదర్శి అంజయ్య, ఉపాధ్యక్షులు రామచంద్రారెడ్డి, సత్యనారాయణ గౌడ్,రాఘవరెడ్డి, ఎమ్మెస్‌గౌడ్,ఉపేందర్, కెఎస్ఎన్‌చారి, శ్రీనివాసులు, ఎస్ఎం మల్లి, ఫరీద్ తదితరులు పాల్గొన్నారు.

## యువత స్వయం ఉపాధిలో రాణించాలి

**-ఐకృత ఫౌండేషన్ చైర్మన్, ఎన్ఆర్ఐ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి**



గ్లోబల్ కంప్యూటర్ సేల్స్ అండ్ సర్వీస్ షాపును ప్రారంభిస్తున్న చైర్మన్ సుంకిరెడ్డి

**కల్వకుర్తి, మే26 ప్రభాతవార్త:** యువత స్వయం ఉపాధిలో రాణించి ఉన్నతంగా ఎదగాలని ఐకృత ఫౌండేషన్ చైర్మన్, ఎన్ఆర్ఐ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి అన్నారు. కల్వకుర్తి పట్టణంలోని గ్లోబల్ కంప్యూటర్ సేల్స్ అండ్ సర్వీస్ షాపును ఐకృత ఫౌండేషన్ చైర్మన్, ఎన్ఆర్ఐ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి నిర్వాహకులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి యువత స్వయం ఉపాధితో ఎదగాలని, నిరుద్యోగ యువత ప్రభుత్వ ఉద్యోగాలపై ఆధారపడకుండా వ్యాపార రంగాల్లో రాణించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని అకాంక్షించారు. కార్యక్రమంలో జూపల్లి గ్రామ సర్పంచ్ మల్లీశ్వరి బాలరాజు, గౌరిపల్లి సర్పంచ్ అనురాధ నరేందర్ గౌడ్,నిర్వాహకులు జంతుక దేవస్వామి, రాజు, రాకేష్, ఫౌండేషన్ సభ్యులు తదితరులు ఉన్నారు.

## సేవలతోనే గుర్తింపు



అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

**కల్వకుర్తి, మే 26 ప్రభాతవార్త:** సమాజంలో మనం చేపట్టే సామాజిక సేవా కార్యక్రమాలతో గుర్తింపు లభిస్తుందని రాంరెడ్డిపల్లి ఎంపీటీసీ సభ్యులు లయన్ కలిమిచెర్ల గోపాల్ అన్నారు. శుక్రవారం కల్వకుర్తి పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో లయన్స్‌క్లబ్ కల్వకుర్తి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా లయన్స్‌క్లబ్ కల్వకుర్తి ఆధ్వర్యంలో చేపడుతున్న కార్యక్రమాలు సమాజానికి ఆదర్శంగా నిలుస్తున్నాయని క్లబ్ అధ్యక్షులు లయన్ కలిమిచెర్ల రమేష్ సహకారంతో పేదలకు 400మందికి అన్నదానం చేశారు.కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి చిగుళ్లపల్లి శ్రీధర్,కోశాధికారి దుగ్గివెంకటేష్, జాయింట్ సెక్రటరి మిర్యాల శ్రీనివాస్‌రెడ్డి, మెంబర్‌షిప్‌కమిటీ చైర్మన్ గుబ్బకిషన్, తర్నికల్ శ్రీనివాస్, జూలూరి ప్రకాష్, గోవింద్ శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

## జూన్ 12న గద్వాలకు సీఎం రాక

**గద్వాల ప్రతినిధి, మే26 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పరిపాలనా సౌలభ్యంగా ఉండేందుకు గాను జిల్లాలు ఏర్పాటు చేయడంతో పాటు పరిపాలన అంతా కూడా ఒకేచోట ఉండేలా భారీ వ్యయంతో జిల్లా నూతన సమీకృత భవనాలను ఏర్పాటు చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి జూన్ 12వ తేదీ సోమవారం జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయాన్ని సీఎం కెసిఆర్ ప్రారంభించనున్నారు.

## క్రీడా దుస్తుల పంపిణీ



క్రీడాకారులకు క్రీడా దుస్తులను అందజేసిన దృశ్యం

**మల్దకల్, మే26 ప్రభాతవార్త:** మల్దకల్‌లో ఎస్‌డిఎ నిర్వహిస్తున్న ఫుట్‌బాల్, సమ్మర్ క్యాంపులో భాగంగా ఫుట్‌బాల్ క్రీడాకారులకు మాజీ సర్పంచ్ దామ నాగరాజు పిల్లలకు క్రీడా దుస్తులను పంపిణీ చేయడం జరిగింది. కార్యక్రమంలో భాగంగా జోగులాంబ జిల్లా ఇండోర్ స్టేడియం ఇంఛార్జి పిడి జితెందర్, జోగులాంబ జిల్లా ఫుట్‌బాల్ కోచ్ విజయ్ అదేవిధంగా పిల్లల మానసిక ధృఢత్వం కోసం గుడ్లను పంపిణీ చేసిన ఎస్ఎల్‌వి మెడికల్ రాజు, పీఈటి తిరుమలేష్, లక్ష్మణ్, ఫుట్‌బాల్ కోచ్ పాల్గొన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న వారందరికి ఫుట్‌బాల్ క్రీడాకారులు అభినందనలు తెలిపారు.

## దేవాలయ విగ్రహా ప్రతిష్టకు రూ.50వేల ఆర్థిక సహాయం



**అచ్చంపేట, మే26 ప్రభాతవార్త:** ఉప్పునుంతల మండల కేంద్రంలోని వీరనా గమ్మ దేవాలయ విగ్రహా ప్రతిష్టకు రూ.50వేళను బీజేపీ నియోజకవర్గ ఇన్ చార్జి నాయకులు దేవినేని సతీష్ మాదిగ ఆలయ నిర్వాహకులకు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భక్తితోనే ముక్తి లభిస్తుందని, ప్రతి ఒక్కరు భక్తి భావాన్ని కలిగి ఉండాలన్నారు. దేవాలయాలాభివృద్ధికి తమవంతు సహాయ సహకారాలు అందించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు తదితరులు ఉన్నారు.

# మహాసంపర్క్ అభియాన్ ప్రజల్లోకి తీసుకెళ్లాలి

**● రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు పద్మజారెడ్డి**



సమావేశంలో మాట్లాడుతున్న పద్మజారెడ్డి

**మహబూబ్‌నగర్ ప్రతినిధి, మే 26 ప్రభాతవార్త:** భారతీయ జనతాపార్టీ జడ్చర్ల మున్సిపాలిటీ టౌన్ కార్యవర్గ సమావేశం పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు పద్మజారెడ్డి హాజరై మాట్లాడుతూ ప్రధానమంత్రి నరెంద్రమోడీ 9 ఏళ్ల పాలనలో సాధించిన విషయాలు సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకుపోవాలని తెలిపారు. భారతదేశంలో ప్రధానమంత్రి నరెంద్రమోడీ వచ్చిన తర్వాత దేశ అభివృద్ధితో పాటు ప్రపంచ దేశాలు సైతం నరెంద్ర మోడీ పాలన మెచ్చుకుంటున్నారన్నారు. తెలంగాణలోకాంగ్రెస్, బిఆర్ఎస్ పార్టీలను ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరని తెలిపారు. జూన్ 1 నుంచి జూన్ 30వ తేదీ వరకు నరెంద్రమోడీ తొమ్మిదేళ్ల పాలన విజయాలను ప్రజల్లోకి తీసుకుని వెళ్లేందుకు జన సంపర్క్ అభియాన్‌అనే కార్యక్రమం రూపొందించడం జరిగిందనితెలిపారు. టౌన్‌లో శక్తికేంద్రం బూత్ స్థాయిలో కార్యక్రమాలు విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బిజెపి పట్టణ అధ్యక్షుడు సామలనాగరాజు,అసెంబ్లీ కన్వీనర్ పూలమోని నర్సింలు,కౌన్సిలర్‌కుమ్మరిరాజు,జిల్లాఅధికార ప్రతినిధి సామల నర్సింలు, జిల్లా కార్యవర్గ సభ్యుడు రాజశేఖర్‌రెడ్డి,టౌన్ ప్రధాన కార్యదర్శి వెంకట్,జిల్లా మహిళామోర్చా ప్రధాన కార్యదర్శిసాహితీరెడ్డి,బిజెవైఎం అధ్యక్షుడు పిట్టల నరేష్, ఓబిసి మోర్చా పట్టణ అధ్యక్షుడు అనంతకిషన్, మహిళా మోర్చా అధ్యక్షురాలు జ్యోతి, ఎస్సీ మోర్చా అధ్యక్షుడు జగదీష్ మల్లేష్, శ్రీనివాస్ గౌడ్, మురళికృష్ణ, రవి, భరత్‌గౌడ్, కిట్టు, శివశివరాం, మహేష్‌కుమార్, జంగయ్య,బూత్ అధ్యక్షులు బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఏర్పాటు చేయాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ నాయకులు

**చిన్నంబావి,మే26 ప్రభాతవార్త:** చిన్నంబావి మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల , ప్రభుత్వ పాఠశాలలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తు ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ సంఘాల ఆధ్వర్యంలో తహసీల్దార్ ఘన్సీరామ్ నాయక్ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఆదిశరత్, డివైఎఫ్ఐజిల్లా ఉపాధ్యక్షుడు బి.కుమార్ మాట్లాడుతూ... చిన్నంబావి మండలం నూతనంగా ఏర్పడి ఆరు సంవత్సరాలు పూర్తవుతున్న నేటికీ ప్రభుత్వ విద్యా సంస్థలు నెలకొల్పేందుకు ప్రభుత్వం పాలకులు అధికారులు చొరవ తీసుకోకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. చిన్నంబావి మండల కేంద్రం 16 గ్రామ పంచాయతీలతో కూడి ఉందని ఇందులో 8 ప్రభుత్వహై స్కూల్స్, ఒక కస్తూర్బా పాఠశాల ఉండడంతో పదవ తరగతి విద్యార్థులు ప్రతి సంవత్సరం 400 నుండి 500 మంది ఇంటర్మీడియట్ విద్య కోసం దూరపు ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తుందని, అంతేకాకుండా మండల కేంద్రంలో కనీసం ప్రభుత్వ పాఠశాల ఏర్పాటుకు కూడా నోచుకోవడం లేదని అన్నారు. ప్రభుత్వ పాఠశాల లేకపోవడంతో కొప్పునూరు, పెద్దమారూర్, అయ్యవారిపల్లి, ఇతర ప్రాంతాలకు కాలినడకన వెళ్లి చదువుకోవాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. కావునా తక్షణమే విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలతో పాటు ప్రభుత్వ పాఠశాలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

# దేవరకద్రలో ఘనంగా వాసవిమాత పల్లకిసేవ



వాసవిమాత అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

**దేవరకద్ర,మే26ప్రభాతవార్త:** దేవరకద్రలోని శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో శుక్రవారం అమ్మవారి పల్లకిసేవ కార్యక్రమాన్ని అత్యంత ఘనంగా నిర్వహించారు. ప్రతి శుక్రవారం అమ్మవారి పల్లకిసేవ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. అందులో భాగంగానే ఈ పవిత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. అమ్మవారికి అభిషేక కార్యక్రమాన్ని నిర్వ హించారు. ఈ సందర్భంగా అమ్మవారిని పల్లకిలో తీసుకొని దేవస్థానం చుట్టూ ప్రదిక్షణలు నిర్వహించారు. పురోహితుల వేధమంత్రాలు, భక్తులు హరి నామశ్చరణల మధ్య ఈ సేవ ముందుకు కదిలింది. అనంతరం అమ్మవారి సన్నిధిలో అర్చకుడు హరిశంకరశర్మ అధ్వర్యంలో ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు తదతర పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వాసవిమాత అమ్మవారు అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. గుబ్బ భాగ్యలక్ష్మీ, బలరాంల అధ్వర్యంలో భక్తులకు అల్పాహారం ఏర్పాటు చేశారు.

**ఘనంగా కుంకుమార్చన:** దేవస్థానంలో శ్రీచక్రాలతో అమ్మవారికి కుంకుమార్చన పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. అలితా సహస్రనామపారాయణం కార్యక్రమాన్ని కూడ నిర్వహించారు. మహామంగళ హారతి, ప్రసాదవితరణ తదితర కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం కమిటీ అధ్యక్షుడు కల్వకన్నయ్యశెట్టి, మహిళాసంఘం అధ్యక్షురాలు గుద్దేటి మంజులరాణీలతో పాటు స్థానిక ఆర్యవైశ్యులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# క్రీడలతో శారీరక, మానసిక ఉల్లాసం

**● మహబూబ్‌నగర్ ఎస్పీ నరసింహ**



కబడ్డీ ఆడుతున్న ఎస్పీ నరసింహ.. పోలీస్ సిబ్బంది, అధికారులతో ఎస్పీ

**మహబూబ్‌నగర్ ప్రతినిధి, మే 26 ప్రభాతవార్త:** నిత్యం విధుల్లో బిజీ బిజీగా,ఎంతో ఒత్తిడితో ఉండే పోలీసులు తరచూ క్రీడలు ఆడటం వల్ల ధృఢత్వంతో పాటు మానసిక ఉల్లాసం కలుగుతుందని మహబూబ్‌నగర్ ఎస్పీ నరసింహ అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో సిబ్బంది, అధికారులకు జిల్లా స్పోర్ట్స్ మీట్ 2023లో భాగంగా క్రీడలను ఎస్పీ ప్రారంభించారు. నిత్యం ఒత్తిడితో విధులు నిర్వహించే పోలీసులకు మానసిక ప్రశాంతతో పాటు ఉల్లాసంగా ఉండాలంటే క్రీడలు ఎంతో అవసరమన్నారు. క్రీడలతో స్నేహభావం కూడా పెరుగుతుందన్నారు. అనంతరం వాలీబాల్ కబడ్డి ఆడి అందరిని ఉత్సాహపరిచారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ శ్రీరాములు, ఏఆర్ అడిషనల్ ఎస్పీ సురేష్‌కుమార్, డీఎస్పీలు మహేష్, రమణారెడ్డి, డిఎస్పీ శ్రీనివాసులు, ఇన్స్ పెక్టర్లు, రిజర్వ్‌ఇన్స్ పెక్టర్లు, ఎస్సైలు, ఆర్ఎస్ఐలుసిబ్బంది పాల్గొన్నారు.

# రైతుల ఇబ్బందులను పరిష్కరించాలని వినతి



డీటికి వినతి పత్రం అందిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

**కల్వకుర్తి, మే 26 ప్రభాతవార్త:** యాసంగిలో రైతులు ధాన్యం అమ్మకాల్లో మిల్లర్ల దగ్గర పడుతున్న ఇబ్బందులను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ పార్టీ నాయకులు డిప్యూటీ తహసీల్దార్ కవితకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆరుగాలం కష్టపడి పండించిన వరి ధాన్యం అకాల వర్షాలతో ఇబ్బందులు పడుతూ చేతికి వచ్చినటువంటి నష్టపోయి మిగిలిన ధాన్యాన్ని అమ్ముకుందామని మిల్లర్లకు దగ్గరకు వస్తే క్వింటాల్‌కు దాదాపుగా 15 కిలోలల దాకా తరుగు పేరుతో తీసేస్తూ రైతుల దగ్గర దోచుకుంటున్నారని తెలిపారు. ప్రభుత్వం మిల్లర్లు కుమ్మక్కై రైతాంగాన్ని మోసం చేస్తూ కోట్లాది రూ॥లు రైతుల కష్టార్జితాన్ని దోచుకుంటున్నారని ఎద్దేవా చేశారు. రైతులను సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని, లేని పక్షంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున రైతులతో కలిసి నిరసనలు వ్యక్తం చేస్తామని తెలిపారు. వినతి పత్రం అందజేసిన వారిలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు కాయితీ విజయ్ కుమార్‌రెడ్డి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు చిమ్ముల శ్రీకాంత్‌రెడ్డి, జిల్లా కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి మిర్యాల శ్రీనివాస్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షులు రాపోతు అనిల్‌గౌడ్, తర్నికల్ సర్పంచ్ తాళ్ల పాండుగౌడ్, నాయకులు శేఖర్, గోపాల్, తిరుపతిరెడ్డి, వంశీ, దాస్య నాయక్, గణేష్,మహమ్మద్, శ్రీధర్‌రెడ్డి, ఆంజనేయులు, శంకర్‌నాయక్, ఆరీఫ్, చందు, సతీష్, భాస్కర్, శివ, సంతోష్ తదితరులు ఉన్నారు.

# ప్రభుత్వం ఐకేపీ వీవోఏల పట్ల నిరంకుశ వైఖరి విడనాడాలి

**- సీఐటీయు జిల్లా సహాయ కార్యదర్శి గోపాలకృష్ణ**



మాట్లాడుతున్న సీఐటీయు జిల్లా సహాయ కార్యదర్శి గోపాలకృష్ణ

**వనపర్తి టౌన్,మే26 ప్రభాతవార్త:** ప్రభుత్వం ఐకేపీ వీవోఏల పట్ల నిరంకుశ వైఖరి విడనాడి, వారి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని సీఐటీయు జిల్లా సహాయ కార్యదర్శి గోపాలకృష్ణ డిమాండ్ చేశారు. ఐకేపీ వీవోఏల సమ్మె శుక్రవారం నాటికి 40 రోజుకు చేరుకుంది. జిల్లా కేంద్రంలోని వెలుగు కార్యాలయం ఎదుట నిర్వహించిన సమ్మె శిబిరంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ...రాష్ట్ర ప్రభుత్వం ఐకేపీ వీవోఏల సమ్మె పట్ల నిరంకుశ వైఖరి ప్రదర్శిస్తుందని ఆయన విమర్శించారు. గత 40 రోజులుగా ఐకేపీ వీవోఏలు సమ్మె చేసునతన్న ఏమీ పట్టనట్లుగా ప్రభుత్వం వ్యవహరిస్తుందని ఆయన మండిపడ్డారు. నెలసరి వేతనం 3900లతో కార్మికులు జీవనం ఎలా కొనసాగిస్తారని, కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని,అర్హులైన వారిని సీసీలుగా ప్రమోషన్ కల్పించాలని,సెర్ప్ నుండి గుర్తింపు కార్డులు అందించాలని, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. సమ్మె డిమాండ్లను పరిష్కరించకపోతే సమ్మెను ఉధృతం చేస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఐకేపీ వీవోఏల వనపర్తి మండల కోశాధికారి చందు నాయక్, కార్యదర్శులు భరత్, లోకయ్య, బాలీశ్వరి, రాధ, లలిత, మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.

## రైతుబీమా చెక్కు అందజేసిన ఎమ్మెల్యే



రైతుబీమా చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

**గద్వాల ప్రతినిధి, మే26 ప్రభాతవార్త:** గద్వాల జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గట్టు మండల పరిధిలోని మాచర్ల గ్రామానికి చెందిన ప్రభాకర్ మరణించారు. వారి కుటుంబ సభ్యులకు భార్య సునితకు ప్రభుత్వం తరపున ఆర్థిక సహాయం ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి చేతుల మీదుగా రైతుబీమా రూ. 5 లక్షల చెక్కును అదజేశారు. ఆపద స్థితిలో ఉన్న మమ్మల్ని ఆదుకున్నందుకు తెలంగాణ ప్రభుత్వం ముఖ్యమంత్రికి,ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎంపిపి విజయ్, గద్వాల టౌన్‌పార్టీ అధ్యక్షుడు గోవింద్, బిఆర్ఎస్ పార్టీ నాయకులు అలీ, సురేష్, నర్సింహులు, తిమ్మప్ప, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## కంటి వెలుగు అద్దాల పంపిణీ



కంటి అద్దాలు పంపిణీ చేస్తున్న దృశ్యం

**వనపర్తి వైద్య విభాగం,మే 26 ప్రభాతవార్త:** జిల్లా కేంద్రంలోని 24వ వార్డులో కంటి వెలుగు కార్యక్రమంలో మహిళలకు వచ్చిన కంటి అద్దాలను బీఆర్ఎస్ పార్టీ 24వ వార్డు ఇంచార్జ్ యువజన నాయకులు వజ్రాల రమేష్ మాట్లాడుతూ... ముఖ్యమంత్రి కేసీఆర్ అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకువచ్చిన అటువంటి పథకంలో కంటి వెలుగు ఒకటని ఈ పథకాన్ని అందరూ వినియోగించుకోవడం 18 సం.లు నిండిన ప్రతి ఒక్కరు కంటి వెలుగు కేంద్రానికి వచ్చి పరీక్షలు చేయించుకోవడం అవసరమైన వారికి ఉచితంగా అద్దాలు పంపిణీ చేయడమే కాకుండా ఆపరేషన్ అవసరమైన వారికి ఉచితంగా ఆపరేషన్ చేయడం జరిగిందని తెలిపారు. ఇప్పటి వరకు వనపర్తి ప్రజల్లో కంటి వెలుగు కార్యక్రమానికి అనూహ్య స్పందన వస్తుందని తెలిపారు. ఇంత గొప్ప కార్యక్రమాన్ని తీసుకువచ్చిన రాష్ట్ర వ్యవసాయ శాఖ మంతఇ నిరంజన్‌రెడ్డి కి ముఖ్యమంత్రి కేసీఆర్‌కు వనపర్తి పట్టణ ప్రజల తరపున కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్వప్న, సనాత,సోనీ, శాంతమ్మ,అలివేలమ్మ,రత్నమ్మ,రాధా,మానస పాల్గొన్నారు.

## మిషన్ భగీరథ నీటి సరఫరా పంపింగ్‌ను పరిశీలించిన మున్సిపల్ చైర్మన్



పంపింగ్ అవుతున్న విధానం పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్

**ధరూర్, మే26 ప్రభాతవార్త:** మండల పరిధిలోని పెద్ద చింతరేవుల సమీపంలో ఉన్న మిషన్ భగీరథ నీటి సరఫరాను మున్సిపల్ చైర్మన్ బిఎస్ కేశవ్ ఐహెచ్‌పి కంపెనీకి సంబంధించిన మోహన్‌తో పాటు కలిసి వాటర్ సప్లై జరిగే పంపింగ్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా వాటర్ సంబంధించిన క్లోరోసిస్ వాటర్ సప్లై జరిగే పంపింగ్‌ను పరిశీలించి ఎండా కాలాన్ని దృష్టిలో ఉంచుకుని గద్వాల పట్టణంలోని అన్ని వార్డులలో మిషన్ భగీరథ నీరు పట్టణ ప్రజలకు వచ్చే విధంగా ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను చైర్మన్ కేశవ్ కోరారు. కార్యక్రమంలో కౌన్సిలర్ టి.శ్రీను, శ్రీమన్నారాయణ, కృష్ణ, మహేష్, మిషన్ భగీరథకి సంబంధించిన అధికారులు పాల్గొన్నారు.

## బికెఎంఆర్ ఓపెన్ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం



టాస్ వేసి పోటీలు ప్రారంభిస్తున్న దృశ్యం

**ధరూర్, మే 26 ప్రభాతవార్త:** మండల పరిధిలోని మార్లబీడు గ్రామంలో బికెఎంఆర్ ఓపెన్ క్రికెట్ టోర్నమెంట్ ఘనంగా ప్రారంభమైంది. ఈ సందర్భంగా నాయకులు అల్వాల్‌పాడ్, ద్యాగదొడ్డి జట్ల మధ్య టాస్‌వేసి మ్యాచ్‌ను ప్రారంభించారు. క్రీడాకారులను పరిచయం చేసుకుని జట్టు సభ్యులకు ఆల్‌ద బెస్ట్ చెప్పారు. కార్యక్రమంలోసర్పంచ్ సుజాత శ్రీరాములు, ఎంపిపి నజీమున్నిసాబేగం, జడ్పీటిసి పద్మమ్మ, ధరూర్ మండల పార్టీ ట్రెజరీ ఆనంద్‌రెడ్డి, టిఆర్ఎస్ పార్టీ జిల్లా సమన్వయకర్త కేశన్న, రాఘవేంద్ర, గ్రామ రైతు సమన్వయ సమితి అధ్యక్షులు ఎం. తిమ్మారెడ్డి పాల్గొన్నారు.

## పాటకు పట్టాభిషేకం కార్యక్రమానికి మంత్రి నిరంజన్‌రెడ్డికి ఆహ్వానం



మంత్రి నిరంజన్‌రెడ్డిని ఆహ్వానిస్తున్న నాయకులు

**వనపర్తి టౌన్,మే 26 ప్రభాతవార్త:** జిల్లా కేంద్రంలోని దాచ లక్ష్మయ్య ఫంక్షన్‌హాల్లో నేడు, రేపు జరిగే పాటకు పట్టాభిషేకం కార్యక్రమానికి రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్‌రెడ్డిని ఆహ్వానించినట్లు నిర్వాహకులు తెలిపారు. పాటకు పట్టాభిషేకం, కవికి పట్టాభిషేకం కార్యక్రమం నిర్వహిస్తున్నామని, జిల్లాలోని కవులు, కళాకారులు, గాయకులతో పాటురాష్ట్ర సాహిత్య అకాడమీ చైర్మన్ జూలూరి గౌరీ శంకర్, తెలంగాణ అధికార సంఘం భాష సంఘం అధ్యక్షులు మంత్రి శ్రీదేవి, ప్రముఖ ప్రకృతి తత్వవేత్త , కవి జయరాజ్ హాజరు కానున్నట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో నిర్వాహక గౌరవ అధ్యక్షుడు గంధం నాగరాజు, అధ్యక్షుడు , ప్రచార కార్యదర్శి నాగేంద్రం సాగర్, కార్యదర్శి గిరిరాజాచారి లు పాల్గొన్నారు.

## రంగవరంలో కంటి వెలుగు ప్రారంభం



కంటి వెలుగు కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న సర్పంచ్ జయసుధ

**వీపనగండ్ల,మే 26 ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని రంగవరం గ్రామంలో డాక్టర్ వంశీకృష్ణ ఆధ్వర్యంలో కంటి వెలుగు కార్యక్రమాన్ని సర్పంచ్ జయసుధ ప్రారంభించారు. ఈ కార్యక్రమం ఆదివారం వరకు కొనసాగుతుందని గ్రామ ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, అవసరమైన వారికి ఉచితంగా కంటి అద్దాలు అందజేయడం జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో క్యాంప్ ఆఫీసర్ డాక్టర్ భాగ్యశ్రీ, సునందన, భారతి, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

## ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నాణ్యమైన విద్యను అందిస్తున్నాం!

**- ప్రిన్సిపాల్ రామ్‌రెడ్డి**



**వీపనగండ్ల,మే26 ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నాణ్యమైన విద్యను అందిస్తున్నామని, అనుభవజ్ఞులైన అధ్యాపకులచే ప్రత్యక్ష బోధన విశాలమైన తరగతి గదులు అధునాతన ప్రయోగశాలలు ఎస్సీ,ఎస్టీ, బీసీ మైనార్టీ విద్యార్థులకు స్కాలర్‌షిప్, బస్సు సౌకర్యం ఉంటుందనిప్రిన్సిపాల్ రామ్‌రెడ్డి తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులు అనవసరంగా డబ్బులు వృధా చేసుకోకుండా మా కళాశాలలో అడ్మిషననతీసుకోవచ్చని వారన్నారు. జూన్ 1వ తేదీ నుండి ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు తరగతులు ప్రారంభమవుతాయని తెలిపారు. సరిగ్గా చదవలేని విద్యార్థులకు స్పెషల్‌తరగతులు ఉంటాయని వారి మీద ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటామని తెలిపారు.


వార్త VAARTHA CLASSIFIEDS

FOR SALE

★ PLOT FOR SALE: 175 SQ. YD. NORTH EAST CORNER PLOT IN JADCHERLA KVMPT

CALL - 9948124949

(Ro.No. 8304)

గమనిక

## మృతుల కుటుంబాలకు పరామర్శ



మృతుల కుటుంబాలను పరామర్శిస్తున్న మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం

**కల్వకుర్తి, మే 26 ప్రభాతవార్త:** కల్వకుర్తి పట్టణంలో మృతి చెందిన ఖుద్దుస్ మరియు చింతోజు నర్సింహ్మాచారిల కుటుంబ సభ్యులను పరామర్శించి మృతుల కుటుంబ సభ్యులను ఓదార్చారు. మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.5వేల చొప్పున ఆర్థిక సహాయం అందించారు. కార్యక్రమంలో మాజీ చైర్మన్ రాచోటి శ్రీశైలం, అశోకాచారి, మల్లిఖార్జునచారి, వెంకటేష్‌చారి, యాదగిరాచారి తదితరులు ఉన్నారు.

## ఆత్మరక్షణకు కరాటే చాలా అవసరం



విద్యార్థులకు బెల్ట్‌లను ప్రదానం చేస్తున్న దృశ్యం

**ఊర్కొండ, మే26 ప్రభాతవార్త:** ఊర్కొండ మండల కేంద్రంలో విక్టరీ షోటో ఖాన్ కరాటే అసోసియేషన్ దూ ఇండియా ఆధ్వర్యంలో మాస్టర్ కిరణ్ నాయక్ అధ్యక్షతన కరాటే బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ బెల్ట్ టెస్ట్ కార్యక్రమానికి ఎగ్జామినర్‌గా మాస్టర్ లవకుమార్ హాజరై దాదాపుగా 25 మంది విద్యార్థినీ, విద్యార్థులకు వారి వారి సిలబస్ పరీక్షించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా నాగర్‌కర్నూల్ జిల్లా కరాటే, కబడ్డీ అసోసియేషన్ చైర్మన్ ముచ్చర్ల జనార్ధన్‌రెడ్డి హాజరై ప్రస్తుత సమాజంలో అమ్మాయిలపై జరుగుతున్న అఘాయిత్యాలను, మానభంగాలు అరికట్టడానికి, ఎవరైనా ఆపదలో ఉంటే రక్షించడానికి కరాటే అనేది చాలా అవసరమని, ప్రతి ఒక్కరు కరాటే నేర్చుకోవాలని వివరించి వారికి యెల్లో, ఆరెంజ్, గ్రీన్, బ్లూ, బ్రౌన్ బెల్ట్స్ అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు గిరి నాయక్, గ్రామ సర్పంచ్ కొమ్ము రాజయ్య, సబ్ ఇన్‌స్పెక్టర్ నరేష్, కృష్ణ గౌడ్, రాచకొండ గోపి, నరేష్, కంటం సందీప్, మల్లేష్, శ్రీను, కరాటే మాస్టర్ లవకుమార్, వినోద్‌నాయక్, విశ్వం, ఆనంద్‌నాయక్ తదితరులు ఉన్నారు.

## ఆసుపత్రి ప్రారంభోత్సవంపై అధికారులతో సమీక్షా సమావేశం



వైద్య బృందంతో సమీక్షా సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

**అచ్చంపేట, మే 26 ప్రభాతవార్త:** అచ్చంపేట పట్టణంలో నూతనంగా నిర్మించిన 100 పడకల ఆసుపత్రిని మంత్రి హరీష్‌రావు ప్రారంభోత్సవానికి విచ్చేస్తున్న సందర్భంగా అచ్చంపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజు వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ సుధాకర్‌లాల్ సమీక్షా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో ఆసుపత్రిని ప్రారంభించనున్నారని, ఆసుపత్రిలో అన్ని మౌళిక వసతులు, సదుపాయాలతో ఆసుపత్రిని ఏర్పాటు చేశారన్నారు. కార్యక్రమంలో అచ్చంపేట డివిజన్ డిప్యూటీ డీఎం హెచ్‌ఓ తారాసింగ్, రెవెన్యూ అధికారులు సందీప్ తదితరులు ఉన్నారు.

## గూడు చెదిరిన కుటుంబానికి అండగా నిలిచిన సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి




బాలస్వామి ఇంటిపైకప్పు నిర్మాణానికి మెటిరియల్స్ అందజేస్తున్న ఫౌండేషన్ సభ్యులు

**వెల్దండ, మే26 ప్రభాతవార్త:** కాయకష్టం చేసి పైస పైస కూడబెట్టి కట్టుకున్న ఇల్లు అకాల వర్షం, ఈదురుగాలులతో ఇల్లుపైకప్పు రేకులు కొట్టుకొని పోవడంతో నిలువ నీడ లేకపోవడంతో ఆ కుటుంబం ధీనావస్థలో కొట్టు మిట్టాడుతున్నాడు బొల్లంపల్లి గ్రామానికి చెందిన బాలస్వామి. అపన్నహస్తం కోసం ఎదురు చూస్తున్న తరుణంలో నేనున్నాని అభయహస్తం అందించి అపద్భాందుడిలా ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, ఎన్ఆర్ఐ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి బాలస్వామికి అండగా నిలిచి ఇంటిపైకప్పుకు కావాల్సిన మెటిరియల్స్‌ను ఫౌండేషన్ తరుపున అందించారు. కార్యక్రమంలో నాయకులు నారాయణ నాయక్, రామాంజనేయులు, రమేష్‌నాయక్, వెంకట్రావు, రామకృష్ణ, రాజుతో పాటు తదితరులు ఉన్నారు.

## రైతు సమావేశాలు విజయవంతం చేద్దాం

### - బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు రాళ్ల కృష్ణయ్య

**ఖిల్లాఘణపురం, మే26 ప్రభాతవార్త:** రైతుల ఆత్మీయ సమావేశాలలో మండల ప్రజాప్రతినిధులు పాల్గొని విజయవంతం చేయాలని శుక్రవారం స్థానిక మండల పార్టీ కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో రాళ్ల కృష్ణయ్య అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రైతు సమావేశాలను గ్రామాల వారీగా సెక్టార్లుగా చేసి సమావేశాలు జరపాలని మండల స్థాయి నాయకులతో చర్చించారు. మొదటి సెక్టార్‌గా మామిడిమాడలో సోమవారం రైతు సమావేశం జరుపుతామని, రెండవ సెక్టార్ అప్పారెడ్డిపల్లి, 3వ సెక్టార్ కమలొద్దీన్‌పూర్, 4వ సెక్టార్ పర్వతాపూర్, 5వ సెక్టార్ మానాజీపేట 6వ సెక్టార్ సోలీపూర్, 7వ సెక్టార్ ఘణపురం రైతు సమావేశాలు నిర్వహిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సమన్వయ కమిటీ మండల అధ్యక్షుడు వెంకట్రావ్, మార్కెట్ కమిటీ జిల్లా వైస్ చైర్మన్ బాలీశ్వర్ రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ కార్మిక విభాగం జిల్లా అధ్యక్షుడు విక్రమ్ , ఎంపీపీ కృష్ణ నాయక్, జడ్పీటీసీ సామ్య నాయక్, మార్కెట్ కమిటీజిల్లా డైరెక్టర్ గొడుగు సత్యం పాల్గొన్నారు.



రైతు సమావేశాలు నిర్వహిస్తున్న దృశ్యం

# నియోజకవర్గ సమగ్రాభివృద్ధికి అహర్నిశలు కృషి

**●కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ ●రూ.40 లక్షల సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే**

**వెల్దండ, మే26 ప్రభాతవార్త:** నియోజకవర్గ సమగ్రాభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ పేర్కొన్నారు. వెల్దండ మండల పరిధిలోని నారాయణపూర్, రాచూర్, ఎంజీతాండ, వెల్దండ మండల కేంద్రాల్లో రూ.40లక్షల నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులకు ఎంపీపీ విజయజైపాల్‌నాయక్, జెడ్పీటీసీ ధ్యాప విజితారెడ్డి, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు, వెల్దండ గ్రామ సర్పంచ్ యెన్నం భూపతిరెడ్డిలతో కలిసి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ భూమిపూజ చేసి శంకుస్థాపనలు చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అంతర్గత రోడ్ల అభివృద్ధికి అనేక నిధులు వెచ్చించి ప్రజల ప్రయాణాన్ని మెరుగుపర్చడానికి ప్రయత్నిస్తుందన్నారు. మండల కేంద్రం నుంచి అన్ని తాండాలకు రహదారులను అనుసంధానం చేస్తున్నట్లు, గ్రామాలకు దూరంగా ఉన్న గిరిజన తాండాలను ఎన్నో సంవత్సరాల నుంచి ప్రత్యేక గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేయాలనే ప్రజల కోరిక మేరకు ప్రత్యేక గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు మన ఊరు మన పాలనను అందుబాటులోకి తీసుకొచ్చిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కిందన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి నిధులను సీఎం కేసీఆర్ మంజూరు చేశారని, అందులో 14 బీటీ రోడ్లకు అనుమతులు లభించాయన్నారు. సీఎం కేసీఆర్ స్పెషల్ డెవలప్‌మెంట్ క్రింద మరో రూ.15కోట్లు కేటాయించారని ఆయన పేర్కొన్నారు. వెల్దండ మండల కేంద్రంలో రూ.10లక్షలతో గొర్రెల పెంపకందారుల సహకార సంఘ భవనాన్ని, ఎస్సీ కాలనీలో సీసీ రోడ్డు పనులకు భూమి పూజ చేసి పనులను ప్రారంభించారు. నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో అంతర్గత రహదారులను సీసీ రోడ్లుగా మార్చేందుకు కృషి చేస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రజలకు సుపరిపాలన అందిస్తున్న బీఆర్ఎస్ ప్రభుత్వానికి ప్రజలందరు సహకరిస్తున్నారన్నారు. సమావేశంలో వైస్ ఎంపీపీ శాంతిగోపాల్ నాయక్, నాయకులు భాస్కర్ రావు, అంజినాయక్, జయప్రకాష్, దార్లకుమార్, అలీ, శ్రీనునాయక్, యాదగిరి, జంగిలి శ్రీను, తదితరులు ఉన్నారు.



సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

## రాష్ట్ర దశాబ్ది ఉత్సవాలను విజయవంతం చేద్దాం : ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

**వెల్దండ, మే26 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను నియోజకవర్గంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా, వైభవంగా ఉత్సవాలను నిర్వహిద్దామని ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ పిలుపునిచ్చారు. వెల్దండ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎంపీపీ విజయజైపాల్‌నాయక్, జెడ్పీటీసీ ధ్యాప విజితారెడ్డి, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు, వెల్దండ గ్రామ సర్పంచ్ యెన్నం భూపతిరెడ్డిలతో కలిసి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ మాట్లాడుతూ...ముఖ్యమంత్రి కేసీఆర్ సారథ్యంలో తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకొని అద్భుతంగా ముందుకు సాగుతున్న తరుణంలో జూన్ 2 నుంచి 21 రోజుల పాటు దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించుకుందామని, ఒక్కో రోజు ఒక్కో తీరుగా ఉత్సవాలను నిర్వహించి పండుగ వాతావరణాన్ని నెలకొల్పుదామన్నారు. ఆమోదయోగ్యమైన పరిపాలనను సీఎం కేసీఆర్ అందిస్తున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం తెలంగాణ ప్రభుత్వంపై సవితి తల్లి ప్రేమ చూపిస్తే అభివృద్ధికి మొండిచేయి చూపిస్తుందన్నారు. మతాలను రెచ్చగొడుతూ ప్రజల మధ్య మోడీ విద్వేషాలను లేపుతున్నారని ఆయన మండిపడ్డారు. దేశంలోని ఏ రాష్ట్రంలో కూడా ప్రవేశ పెట్టని సంక్షేమ పథకాలను తెలంగాణ రాష్ట్రంలో అమలు చేసి అభివృద్ధిలోనే అగ్రగామీగా తెలంగాణ రాష్ట్రాన్ని సీఎం కేసీఆర్ నిలుపారని ఆయన కొనియాడారు. సమావేశంలో వైస్‌ఎంపీపీ శాంతిగోపాల్‌నాయక్, నాయకులు భాస్కర్ రావు, అలీమ్, శిశుపాల్‌రెడ్డి, జంగిలి యాదగిరి, పిల్లి దేవేందర్‌తో పాటు తదితరులు ఉన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

# పోలీస్ స్టేషన్లో అందరికి ఒకే విధమైన సేవలు అందించాలి

**●డీఎస్పీ రంగస్వామి ●పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన డీఎస్పీ**

**ఇటిక్యాల, మే26 ప్రభాతవార్త:** మండల పరిధిలోని పోలీస్ స్టేషన్‌లో అందరికి ఒకే విధమైన పోలీస్ సేవలు అందించాలని శాంతిభద్రతల విషయంలో సమస్యలు తలెత్తకుండా చూసుకోవాలని డీఎస్పీ రంగస్వామి ఎస్సైను ఆదేశించారు. శుక్రవారం వార్షిక తనిఖీలలో భాగంగా డీఎస్పీ రంగస్వామి ఇటిక్యాల పోలీస్ స్టేషన్‌ను సందర్శించి, సిబ్బంది విధులు స్టేషన్ రికార్డులను తనిఖీలు చేసి పోలీస్ స్టేషన్ పరిసర ప్రాంతాలను పరిశీలించారు. అనంతరం పోలీసు అధికారులతో సిబ్బంది ముఖాముఖ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎస్పీ రంగస్వామి మాట్లాడుతూ పోలీస్ అధికారులకు, సిబ్బందికి ఏవైనా సమస్యలు ఉన్నాయా అని తెలుసుకుని సర్వీస్‌కు సంబంధించిన సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఫంక్షనల్ వర్టికల్ వారిగా విధులు నిర్వహిస్తున్న సిబ్బంది వివరాలు, వారు నిర్వహిస్తున్న విధుల గురించి అడిగి తెలుసుకున్నారు. వర్టికల్ వారిగా అధికారులు, సిబ్బంది విధులు నిర్వహించాలని ప్రజల సమస్యలు తీర్చడానికి ఎల్లవేళలా అందుబాటులో ఉండి సేవలందించాలని సూచించారు. ప్రజలతో మర్యాదపూర్వకంగా మాట్లాడాలని ఫిర్యాదు దారులందరికి ఒకే రకమైన సేవలు అందించాలని సూచించారు. రాబోయే ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని పోలీస్, అధికారులు, సిబ్బంది ప్రజలతో సత్సంబంధాలు మరింత పెంపొందించుకుని శాంతి భద్రతల సమస్యల తలెత్తకుండా చూసుకోవాలని సూచించారు. రోజువారి డిడి, పెట్టి కేసుల నమోదు శాతాన్ని పెంచాలని అన్నారు. తరచూ ప్రాపర్టీ, మానవ సంబంధ నేరాలకు తరచూ పాల్పడే వారిపై సస్పెక్ట్, రౌడీషీట్ ఓపెన్ చేయాలని, స్టేషన్ రికార్డులను ఎప్పటికప్పుడు అప్డేట్ చేసుకోవాలని, ఇసుక, పిడిఎస్ రైస్, నకిలీ సీడ్స్ అక్రమ రవాణాపై పూర్తి నిఘా ఉంచి నియంత్రించాలని, విజిబుల్ పోలీసింగ్‌ను పెంచాలని సూచించారు. ప్రతిరోజు పోలీస్ అధికారులు, సిబ్బంది సమయం దొరికినప్పుడు వ్యాయామం, యోగ, ధ్యానం, వాకింగ్ చేస్తూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. ప్రతి ఒక్కరు నీట్ టర్న్ అవుట్ కలిగి ఉండి, మంచి క్రమశిక్షణ, సమయ పాలన పాటించాలని లీడర్‌షిప్ లక్షణాలు కలిగి ఉండాలని సూచించారు. అనంతరం పోలీస్ స్టేషన్‌లో 5ఎస్ ఇంప్లిమెంటేషన్‌ని పరిశీలించి ఫైలు సక్రమమైన పద్ధతిలో ఉంచాలని సూచించారు. పోలీస్ స్టేషన్ల పరిధిలో ఏ తరహా కేసులు ఎక్కువ నమోదవుతున్నాయా అడిగి తెలుసుకున్నారు. గత మూడు సంవత్సరాల నుండి నమోదవుతున్న కేసుల గురించి కంపారిటివ్ స్టేట్మెంట్‌ను పరిశీలించి, అండర్ ఇన్వెస్టిగేషన్‌లో ఉన్న సిడి ఫైల్స్‌ను, పెండింగ్ ట్రయల్‌లో ఉన్న సిడి ఫైళ్లను, గ్రేవ్ కేసులలో ఉన్న సిడి ఫైళ్లను పరిశీలించారు. రౌడీలు, కేడీలు, సస్పెక్ట్స్, సంఘ విద్రోహ శక్తులపై నిరంతరం నిఘా ఉంచి, వారి కదలికలను గమనించాలని తెలిపారు. రాత్రి పెట్రోలింగ్ అధికారులు పాత నేరస్తులను తనిఖీ చేయాలని ఎస్సైకు సూచించారు. విధి నిర్వహణలో రోల్‌క్లారిటీ, గోల్ క్లారిటీ ప్రతి ఒక్కరికి తెలిసి ఉండాలని సూచించారు. ప్రజల రక్షణ గురించి ఎల్లవేళలా అందుబాటులో ఉండి మెరుగైన సేవలు అందించాలన్నారు. ప్రతి కేసులో క్వాలిటీ ఇన్వెస్టిగేషన్ ఉండాలని కేసులలో శిక్షల శాతం పెంచాని సూచించారు. అధికారులు సిబ్బంది ప్రొయాక్టివ్ పోలీసింగ్ విధులు నిర్వహించాలని డీఎస్పీ తెలిపారు. కార్యక్రమంలో ఇటిక్యాల ఎస్సై గోకారి, ఎఎస్సై అయ్యన్న, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



ఇటిక్యాల పోలీస్ స్టేషన్‌లో ఎస్సైతో మాట్లాడుతున్న డీఎస్పీ రంగస్వామి

## ప్రతి గ్రామానికి బిటి రోడ్ల సౌకర్యం ప్రభుత్వం కల్పిస్తుంది

**●అలంపూర్ ఎమ్మెల్యే డాక్టర్ వి.ఎం అబ్రహాం ●బిటి పనులను ప్రారంభించిన ఎమ్మెల్యే**

**ఇటిక్యాల, మే 26 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్రంలో గ్రామ గ్రామాన ముఖ్యమంత్రి కెసిఆర్ పాలనలో గ్రామాల సర్వతోముఖాభివృద్ధి కోసం ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పించేందుకు బిటి రోడ్ల నిర్మాణం చేపడుతుందని అలంపూర్ ఎమ్మెల్యే అబ్రహం అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని వల్లూరు గ్రామం నుంచి జక్కిరెడ్డిపల్లి గ్రామం వరకు దాదాపు 3 కి.మీ.లు 1 కోటి 70 లక్షల రూపాయలతో చేపట్టే బిటిరోడ్డు పనులను ఎమ్మెల్యే అబ్రహం బిటి వేసే పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అబ్రహం మాట్లాడుతూ అలంపూర్ నియోజకవర్గంలో తెలంగాణ రాష్ట్రం పరిపాలనలో గ్రామ గ్రామాన బిటి రోడ్డు పనులను చేపడుతుందని ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని బిటి రోడ్డు పనులను నాణ్యత ప్రమాణాలతో చేపట్టాలని అధికారులను, కాంట్రాక్టర్‌ను ఎమ్మెల్యే ఆదేశించారు. అదేవిధంగా ప్రజల సౌకర్యం కోసం గ్రామ పంచాయతీ భవనాలు, పారిశుద్ధ్య నిర్వహణకు ట్రాక్టర్ల కొనుగోలు ఇంటింటికి మిషన్ భగీరథ పథకం ద్వారా తాగునీరు, పల్లె ప్రకృతి వనాలు, వైకుంఠధామాలు, ఇతర అనేక రకాల సంక్షేమ పథకాలు తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో సింగిల్‌విండో వైస్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, బిఆర్ఎస్ నాయకులు వేణుగోపాల్‌నాయుడు, ధర్మారెడ్డి, పంచాయతీరాజ్ ఏఈ పాండురంగారావు, పాల్గొన్నారు.



వల్లూరులో మాట్లాడుతున్న అలంపూర్ ఎమ్మెల్యే అబ్రహాం

## మలిదశ ఉద్యమకారుడు కీ.శే. పులికల్ దేవన్నకు అంతిమ వీడ్కోలు

**నివాళులర్పించిన ఎమ్మెల్యే, జడ్పీ చైర్మన్, ప్రజాప్రతినిధులు, ప్రజాసంఘాల నాయకులు**



పులికల్ దేవన్నకు వీడ్కోలు పలుకుతున్న దృశ్యం



**అయిజ, మే26 ప్రభాతవార్త :** మండల పరిధిలోని పులికల్ గ్రామానికి చెందిన మలిదశ ఉద్యమకారుడు నాలుగు రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలై ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం మరణించిన సంఘటన తెలిసిందే. శుక్రవారం ఆయన మృతదేహాన్ని స్వగ్రామంలో ప్రజల సందర్శనార్థం గ్రామంలో ఊరేగించి అంత్యక్రియలు నిర్వహించి అంతిమ వీడ్కోలు పలికారు. ఇందులో భాగంగా ఎమ్మెల్యే అబ్రహం, జడ్పీ చైర్‌పర్సన్ సరిత ఆయన పార్థీవదేహానికి నివాళులర్పించి వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. అంతకుముందు రాష్ట్ర కన్స్యూమర్ చైర్మన్ గట్టు తిమ్మప్ప, ఉమ్మడి జిల్లా మాజీ జడ్పీ చైర్మన్ బండారి భాస్కర్, బిఆర్ఎస్ నాయకుడు లక్ష్మీకాంతారావు, గ్రంథాలయ మాజీ చైర్మన్ పటేల్ విష్ణువర్దన్‌రెడ్డి, సింగిల్ విండో అధ్యక్షులు మధుసూదన్‌రెడ్డి, మాజీ సింగిల్ విండో అధ్యక్షులు పురంధాముడు, అయోధ్య మున్సిపల్ చైర్మన్ చిన్న దేవన్న, బింగిదొడ్డి మాజీ సర్పంచ్ దొడ్డప్ప, ప్రజా సంఘాల నాయకులు ఆయా పార్టీల నాయకులు ఆయన పార్థీవ దేహానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూదేవన్న మరణంచాలా బాధాకరం. బిఆర్ఎస్ పార్టీకి తీరని లోటని పేర్కొన్నారు. వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపి బిఆర్ఎస్ పార్టీ తరపున అన్ని విధాలుగాఅండగా ఉంటుందని సీఎం కెసిఆర్, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ దృష్టికి తీసుకెళ్లివారికి పార్టీ తరపున అన్ని విధాలుగా ఆదుకునేలా కృషి చేస్తానని తెలియజేశారు. అనంతరం ఎమ్మెల్యే వారి కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయం అందజేశారు. తనయుడు విఎం అజయ్, ప్రతినిధులు, బిఆర్ఎస్ పార్టీ నాయకులు ,అజయ్, అన్నసేవాదళం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఫర్టిలైజర్ షాపుల తనిఖీలు




ఫర్టిలైజర్ షాపులను తనిఖీ చేస్తున్న పోలీస్ సిబ్బంది

**మక్తల్, మే 26 ప్రభాతవార్త:** దామరగిద్ద/ మద్దూరు మండల కేంద్రాల్లో శుక్రవారం పోలీసులు, వ్యవసాయ అధికారులు సీడ్స్, షాప్స్, ఫర్టిలైజర్ షాపులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. షాపుల్లో ఏమైనా నకిలీ విత్తనాలు ఉన్నాయా అని ఆరా తీశారు. అలాగే సరైన ధృవపత్రాలు కలిగి ఉన్నారా లేదా అని విత్తన ప్యాకెట్లను, ఎరువులను, బిల్ బుక్స్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీసులు మాట్లాడుతూ రైతులు వ్యవసాయమే జీవనాధారంగా జీవిస్తుంటారు వారికి నకిలీ విత్తనాలు, నాసిరకం ఎరువులు అమ్మి మోసం చేస్తే షాపుల యజమానులపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని పోలీసులు హెచ్చరించారు. నకిలీ విత్తనాలు అమ్మి పట్టుబడినవారిపై పిడి యాక్ట్ నమోదు చేయడం జరుగుతుందని వారు తెలిపారు. రైతులకు విత్తనాలు అమ్మే సమయంలో ప్రతి ఒక్కరు రిసిప్ట్ ఇవ్వాలని సూచించారు. అలాగే రైతులు కూడా విత్తనాలు ఎరువులు కొనేముందు తప్పకుండా రసీదు తీసుకోవాలని పంట పండేంత వరకు రసీదులను జాగ్రత్తగా ఉంచుకోవాలని తెలిపారు. రైతులు విత్తనాలు కొనేముందు వ్యవసాయ అధికారుల సలహాలు, సూచనలు తీసుకుని విత్తనాలు కొనాలని తెలిపారు. మండలంలో ఎవరైనా నకిలీ విత్తనాలు అమ్మితే వారి సమాచారం పోలీసులకు ఇవ్వాలని వారి వివరాలను గోప్యంగా ఉంచి వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని పోలీసులు తెలిపారు. ఈ తనిఖీలలో వ్యవసాయ అధికారి, పోలీస్ సిబ్బంది మొదలగు వారు పాల్గొన్నారు.

## భట్టిని కలిసిన అనిరుధ్‌రెడ్డి

**▸▸ తిమ్మాజిపేటకు చేరుకున్న పీపుల్స్ మార్చ్ పాదయాత్ర**



మల్లు భట్టివిక్రమార్కతో కలిసి పాదయాత్రలో పాల్గొన్న అనిరుధ్‌రెడ్డి

**మహబూబ్‌నగర్ ప్రతినిధి, మే 26, ప్రభాతవార్త:** సీఎల్పీ నేత భట్టి విక్రమార్క చేపట్టిన పీపుల్స్ మార్చ్ పాదయాత్ర శుక్రవారం మహబూబ్‌నగర్ జిల్లా నుంచి నాగర్‌కర్నూల్ జిల్లాలోకి ప్రవేశించింది. ఈ సందర్భంగా తిమ్మాజిపేటలో మల్లు భట్టి విక్రమార్కను టీపీసీసీ ప్రధాన కార్యదర్శి జనంపల్లి అనిరుధ్‌రెడ్డి కలిశారు. జడ్చర్ల నియోజకవర్గంలో పాదయాత్ర విజయవంతమైనందుకు భట్టి విక్రమార్కకు అభినందనలు తెలిపారు. పార్టీ శ్రేణుల్లో నూతన ఉత్సాహం నిండిందన్నారు. మరింత ఉత్సాహంతో రాహుల్ గాంధీ సందేశాలను ప్రజల్లోకి తీసుకెళ్తామని తెలిపారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క సభను సక్సెస్ చేసినందుకు అనిరుధ్‌రెడ్డిని శుభాకంక్షలు తెలిపారు. కార్యక్రమంలో టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు మాజీ ఎమ్మెల్యే ఎర్రశేఖర్ పాల్గొన్నారు.

## అర్హులందరికీ డబుల్ బెడ్రూం అందజేస్తాం

### - ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి



తాటిపర్తిలో ఆరోగ్య ఉపకేంద్రానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే ఆల

**మహబూబ్‌నగర్ ప్రతినిధి, మే26, ప్రభాతవార్త:** అర్హులైన ప్రతి ఒక్కరికీ విడుతల వారీగా డబుల్ బెడ్రూం ఇల్లు అందజేస్తామని ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి స్పష్టం చేశారు. భూత్పూర్ మండలంలో శుక్రవారం ఆయన పర్యటించారు. కొత్తూరులో 40ఇండ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. గ్రామంలో పర్యటించారు. అనంతరం తాటిపర్తిలో ఆరోగ్య ఉపకేంద్రానికి జెడ్పీ చైర్ పర్సన్ స్వర్ణ సుధాకర్‌రెడ్డితో కలిసి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నిరుపేదలను గుర్తించి అత్యంత పారదర్శకంగా ఇండ్ల లబ్ధిదారులను ఎంపిక చేస్తామన్నారు. అంతకముందు మండలంలోని కొత్తూరు గ్రామంలో బొడ్రాయి ప్రతిష్ఠ ఉత్సవాల్లో పాల్గొన్నారు.

**బాధిత కుటుంబాలకు పరామర్శ :** కప్పెట గ్రామానికి చెందిన వడ్డే భాస్కర్ కొద్దిరోజుల కిందట రోడ్డు ప్రమాదంలో మరణించాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే శుక్రవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. తన ప్రగాఢ సానుభూతిని తెలిపి రూ.10వేల ఆర్థికసాయం అందజేశారు. కప్పెట గ్రామానికి చెందిన బోయ మహేశ్ విద్యార్థి నాలుగు రోజుల కిందట అమెరికాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే గ్రామంలో బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. పార్థివదేహాన్ని అమెరికా నుంచి తెప్పించేలా చర్యలు తీసుకుంటామన్నారు. కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటామని భరోసానిచ్చారు. ఆయా కార్యక్రమాల్లో ఎంపీపీ కదిరె శేఖర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ బస్వరాజ్‌గౌడ్ పాల్గొన్నారు.

## మానవసేవే మాధవసేవ

**వనపర్తి వైద్య విభాగం, మే 26 ప్రభాతవార్త:** శ్రీ సత్యసాయి సేవ సమితి వారు నిర్వహిస్తున్న ఉచిత కంటి వైద్య శిబిరం ఈనెల 28వ తేదీన జిల్లా కేంద్రంలోని శ్రీ సత్యసాయి మందిర ప్రాంగణంలో ఉదయం 11 గంటల నుండి3 గంటల వరకు ఉచిత కంటి పరీక్షలు నిర్వహిస్తారని మందులు, అద్దాలుఉచితంగాపంపిణీ చేస్తారని, వారికి అవసరం అయితే కంటి ఆపరేషన్లు చేస్తారన్నారు. ప్రతి ఒక్కరు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.